జనం రిపోర్టర్ — జన శ్రేయస్సే మా బాధ్యత

# జనం
రిపోర్టర్ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను. అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948

సంపుటి : 01 సంచిక : 232, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజీలు : 08, వెల రూ. 5రూ/ మంగళవారం -17 - డిసెంబర్ - 2024

Published From, Srikakulam : Circulated at,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool , Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad



## దేశంలో నక్సలైట్ల శకం ముగిసింది

జగదల్పూర్‌లో మాజీ నక్సల్స్‌తో అమిత్ షా సమావేశం

31 మార్చి 2026 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా తరిమేస్తామన్న కేంద్రహెూం మంత్రి

ఏడాది కాలంలో 287 మంది నక్సల్స్‌ను భద్రతా బలగాలు హతమార్చాయన్న షా

నక్సల్స్ జనజీవన స్రవంతిలో కలిసిపోయి అభివృద్ధికి సహకరించాలని సూచన

2



## నెహ్రూ లేఖలను తిరిగిచ్చేయండి..

రాహుల్ గాంధీకి 'ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం' లేఖ

చారిత్రక నేపథ్యం ఉన్న లేఖలను తిరిగి పొందేందుకు సాయం చేయాలని విజ్ఞప్తి

2008లో సోనియా గాంధీ ఈ లేఖలను తీసుకున్నారన్న ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం అండ్ లైబ్రరీ

2

# చైనాలోని త్రీ గోర్జెస్ కంటే పోలవరం మెరుగైన ప్రాజెక్టు

- పోలవరం ప్రాజెక్టును సందర్శించిన సీఎం చంద్రబాబు
- అధికారులు, ఇంజినీర్లతో సమీక్ష
- రాష్ట్రానికి పోలవరం గేమ్ చేంజర్ అవుతుందని ధీమా



**అమరావతి,:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు పోలవరం ప్రాజెక్టును సందర్శించిన అనంతరం అధికారులు, ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చైనాలోని త్రీ గోర్జెస్ డ్యామ్ కంటే పోలవరం మెరుగైన ప్రాజెక్టు అని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు కోసం 2014-19 మధ్య రాత్రింబవళ్లు శ్రమించామని తెలిపారు. ఒకేసారి 32 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేసి వరల్డ్ రికార్డు సృష్టించామని చంద్రబాబు వెల్లడించారు. గతంలో డయాఫ్రం వాల్ ను 414 రోజుల్లో పూర్తి చేశామని అన్నారు. జర్మనీకి చెందిన బాయర్ సంస్థ డయాఫ్రం వాల్ నిర్మించిందని వివరించారు. 2014-19 మధ్య 72 శాతం పనులు పూర్తి చేశామని చెప్పారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక కాంట్రాక్టర్ ను మార్చేసి, ప్రాజెక్టును నాశనం చేశారని విమర్శించారు. రివర్స్ టెండరింగ్ తో పోలవరం డ్యామ్ ను గోదాట్లో కలిపేశారని మండిపడ్డారు. పోలవరం, అమరావతి రాష్ట్రానికి రెండు కళ్ల వంటివని చంద్రబాబు అభివర్ణించారు. పోలవరం పూర్తయితే రాష్ట్రానికి గేమ్ చేంజర్ అవుతుందని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే 7 లక్షల ఎకరాలతో కొత్త ఆయకట్టు వస్తుందని తెలిపారు. 23 లక్షల ఎకరాల భూమి స్థిరీకరణ చెందుతుందని పేర్కొన్నారు. పోలవరం ద్వారా విశాఖ పారిశ్రామిక అవసరాలు కూడా తీరతాయని చెప్పారు.

# సొంత జిల్లాలో జగన్ కు భారీ షాక్

**కడప కార్పొరేషన్ పరిధిలోని వైసీపీ కార్పొరేటర్లు పలువురు జగన్ కు షాకిచ్చేందుకు సిద్ధమయ్యారు.**



2లో


**అమరావతి,:** అధికారం ఎటు ఉంటే.. అటు వైపు ఉండేందుకు ఆసక్తి చూపుతున్న ధోరణి అంతకంతకూ ఎక్కువ అవుతోంది. మిగిలిన చోట ఎలా ఉన్నా ఫర్లేదు కానీ అధినేత సొంత ప్రాంతానికి చెందిన నేతలు వ్యవహరించే తీరు మిగిలిన ప్రాంతాల మీదా ఎక్కువ ప్రభావాన్ని చూపే పరిస్థితి. ఇప్పుడు ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారు మాజీ ముఖ్యమంత్రి.. వైసీపీ అదినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి. కడప కార్పొరేషన్ పరిధిలోని వైసీపీ కార్పొరేటర్లు పలువురు జగన్ కు షాకిచ్చేందుకు సిద్ధమయ్యారు. ఎనిమిది మంది కార్పొరేటర్లు ఈ రోజు (సోమవారం) ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో పార్టీ మారేందుకు సిద్ధమైన వైనం కడప జిల్లాలోనే కాదు.. ఏపీ రాజకీయాల్లోనూ ఆసక్తికర చర్చగా మారింది. కడప జిల్లా అన్నంతనే.. యావత్ జిల్లా మొత్తం వైఎస్ కుటుంబానికి వీర విధేయులుగా చెబుతారు. ఈ కారణంతోనే ఎన్నికలు ఏదైనా సరే.. జిల్లాకు చెందిన మెజార్టీ స్థానాలు వైఎస్ కుటుంబం ఏ పార్టీని ఫాలో అవుతుందో ఆ పార్టీ ఖాతాలోకి వెళ్లిపోవటం ఖాయం. అలాంటిది జగన్ చేతి నుంచి అధికారం చేజారిన ప్రస్తుత పరిస్థితుల్లో వైసీపీకి చెందిన ఎనిమిది మంది కార్పొరేటర్లు అధికార తెలుగుదేశం పార్టీలో చేరేందుకు రెఢీ అయిపోయారు. ఈ పరిస్థితుల్లో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి రంగంలోకి దిగారు. పార్టీ మారేందుకు సిద్ధమైన ఎనిమిది మంది కార్పొరేటర్లను బుజ్జగించేందుకు ప్రయత్నాలు చేసినా ఫలించలేదన్న మాట వినిపిస్తోంది.

> జిల్లాకు చెందిన మెజార్టీ స్థానాలు వైఎస్ కుటుంబం ఏ పార్టీని ఫాలో అవుతుందో ఆ పార్టీ ఖాతాలోకి వెళ్లిపోవటం ఖాయం. అలాంటిది జగన్ చేతి నుంచి అధికారం చేజారిన ప్రస్తుత పరిస్థితుల్లో వైసీపీకి చెందిన ఎనిమిది మంది కార్పొరేటర్లు అధికార తెలుగుదేశం పార్టీలో చేరేందుకు రెఢీ అయిపోయారు. ఈ పరిస్థితుల్లో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి రంగంలోకి దిగారు. పార్టీ మారేందుకు సిద్ధమైన ఎనిమిది మంది కార్పొరేటర్లను బుజ్జగించేందుకు ప్రయత్నాలు చేసినా ఫలించలేదన్న మాట వినిపిస్తోంది

తాజాగా పార్టీ మారేందుకు సిద్ధమైన కార్పొరేటర్లలో ఒకరు గత ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషాకు వరుసకు సోదరుడు కావటం గమనార్హం. అంతేకాదు.. కడప మేయర్ సురేష్ బాబుకు కంచుకోట లాంటి చిన్న చౌక్ లో మెజార్టీ కార్పొరేటర్లు టీడీపీలో చేరేందుకు సిద్ధం కావటం రాజకీయ సంచలనంగా మారింది. ఇప్పటికే పార్టీ మారేందుకు సిద్ధమైన వైసీపీ కార్పొరేటర్లు పలువురు ఆదివారం సాయంత్రమే విజయవాడకు తరలి వెళ్లారు. ఈ డ్యామేజ్ ను కంట్రోల్ చేసేందుకు కడప ఎంపీగా వ్యవహరిస్తున్న అవినాష్ రెడ్డి ప్రత్యేకంగా మాట్లాడినప్పటికి ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయినట్లుగా చెబుతున్నారు. తాము ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని.. తాము ఏమీ చేయలేమని తేల్చేయటంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. పవర్ లో ఉన్నప్పుడు తమను పట్టించుకోలేదని.. తాము అడిగిన పనులను చేసేందుకు ఆసక్తి చూపలేదని మండిపడుతున్నారు. దీనికి తోడు ఈ నెల ఏడున కార్పొరేషన్

## తెలంగాణకు వెళితే చికున్ గున్యా వస్తుందని అమెరికాలో చెప్పుకుంటున్నారు

### అసెంబ్లీలో హరీశ్ రావు



2

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం

కేంద్ర నిధులను ప్రభుత్వం పక్కదోవ పట్టిస్తోందన్న హరీశ్

గ్రామాలను కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారని వ్యాఖ్య

# రాష్ట్రంలో ఢిల్లీ టూరిజం.. జైలు టూరిజం బాగా నడుస్తోంది..

- సర్పంచ్‌లకు ఇవ్వాల్సిన రూ.600 కోట్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి
- లగచర్ల అంశంపై కూడా సభలో చర్చించాలని స్పీకర్‌ను కోరినట్లు కేటీఆర్ తెలిపారు
- రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రూ. 7లక్షల కోట్లు అంటూ తప్పుదోవ పట్టిస్తుందని అన్నారు
- రాష్ట్రంలో ఢిల్లీ టూరిజం, జైలు టూరిజం బాగా నడుస్తున్నాయని ఎద్దేవా

## కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ సెటైర్లు




**హైదరాబాద్, :** ఆర్థిక మంత్రి ప్రసంగం పూర్తిగా అవాస్తవమని "హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియన్ స్టేట్స్" పేరుతో ఆర్బీఐ విడుదల చేసిన నివేదికలో నిరూపితమైందని కేటీఆర్ అన్నారు. 2014-15లో తెలంగాణ మొత్తం రుణాలు రూ.72 వేల 658 కోట్లు ఉండగా, 2024 మార్చి నాటికి ఈ రుణాల మొత్తం రూ. 3,89, 673 కోట్లకు చేరిందని ఆర్‌బీఐ వెల్లడించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ అప్పులు కేవలం రూ.3.89 లక్షల కోట్లు అని ఆర్బీఐ నివేదికలో స్పష్టం చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రూ.7లక్షల కోట్లు అంటూ తప్పుదోవ పట్టిస్తుందని విమర్శించారు. రాష్ట్ర అప్పులపై ఆర్థిక మంత్రి ఉద్దేశపూర్వకంగానే తప్పుడు సమాచారమిచ్చి, గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించారని అన్నారు. అందుకే తెలంగాణ శాసనసభ కార్య విధాన మరియు కార్యక్రమ నిర్వహణ నియమావళిలోని 168 (1) నిబంధన ప్రకారం బీఆర్ఎస్ శాసనసభా పక్షం తరఫున ఆర్థిక మంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తున్నామని చెప్పారు. మిగతా 2లో..

## ప్రధాని మోదీతో శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకే భేటీ..!

శ్రీలంక అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత దిసనాయకే తొలి విదేశ పర్యటన ఇదే.



2

## ఏ జిల్లానూ రద్దు చేయబోవడం లేదు

పాత జిల్లాలను రద్దు చేసే ఆలోచన లేదని వెల్లడి

రాష్ట్ర ప్రభుత్వమేదైనా నిధుల కోసం కేంద్రం వద్దకు వెళ్లడం సాధారణ విషయమని వెల్లడి

వెళ్లిన ప్రతిసారీ నిధులు రావన్న మంత్రి



2

## కొరుకుడుపడని కొయ్యగా మారిన దేశ రాజధాని..

ఈసారైనా కమలనాథుల కల నెరవేరేనా..?



2

**న్యూఢిల్లీ,:** భారతీయ జనతా పార్టీ కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. కానీ దేశ రాజధాని ఢిల్లీలో మాత్రం మూడు దశాబ్దాలుగా అధికారం ఆ పార్టీకి అందని ద్రాక్షగా మిగిలిపోయింది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ కలిసి పోటీ చేసినా సరే క్లీన్ స్వీప్ చేసిన కమలదళం అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి చతికిలపడుతోంది. చివరిసారిగా 1993లో గెలుపొందిన ఆ పార్టీ, మళ్లీ ఇప్పటి వరకు అధికారం చేజిక్కించుకోలేకపోయింది. మరో రెండు నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి ఎలాగైనా గెలిచి తీరాలన్న పట్టుదలతో కమలదళం ఉంది. బీజేపీకి సైంద్ధాంతిక మాతృసంస్థ 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ' కూడా రంగంలోకి దిగి బీజేపీ గెలుపు కోసం వ్యూహాలు అమలు చేస్తోంది. వరుసగా రెండు పర్యాయాలు గెలిచి అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ ను ఈ సారి ఎలాగైనా నిలువరించాలి ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో

## తెలంగాణలో హరిత విప్లవం దిశగా కీలక అడుగులు..

# సీఎం రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం..!



2

**హైదరాబాద్, :** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయ్యింది. స్వరాష్ట్రంలో పదేళ్లుగా ఎదురే లేదనుకున్న గులాబి పార్టీని ఓడించి, తెలంగాణకు రెండో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఇక అంతే దూకుడుగా రేవంత్ రెడ్డి పాలనలో దూసుకుపోతున్నారు. ఈ క్రమంలోనే సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కోసం కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు సీఎం. ప్రపంచవ్యాప్తంగా సవాలుగా మారుతోన్న వాతావరణ మార్పులను అధిగమించేందుకు రేవంత్ రెడ్డి ఈ దిశగా అడుగులు వేస్తున్నారు.

## సచివాలయంలో ముగిసిన చంద్రబాబు, పవన్ భేటీ



2

పోలవరం ప్రాజెక్టును సందర్శించిన చంద్రబాబు

పోలవరం నుంచి చంద్రబాబు రాగానే వెళ్లి కలిసిన పవన్

సచివాలయంలో దాదాపు 40 నిమిషాల పాటు సమావేశం

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక



# దేశంలో నక్సలైట్ల శకం ముగిసింది

మొదటి పేజి తరువాయి

**న్యూఢిల్లీ,:**దేశంలో నక్సలిజం చివరి అంకంలో ఉందని, మార్చి 2026 నాటికి దానిని పూర్తిగా తుడిచిపెట్టేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. చత్తీస్‌గఢ్‌లోని బస్తర్, మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన దాదాపు 30 మంది మాజీ నక్సల్స్‌తో చత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో అమిత్ షా నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో 31 మార్చి 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా రూపుమాపుతామని నొక్కి వక్కాణించారు. గత ఏడాది కాలంలో 287 మంది నక్సల్స్‌ను భద్రతా దళాలు హతమార్చాయని, 1000 మందిని అరెస్ట్ చేయగా, 837 మంది లొంగిపోయారని అమిత్ షా తెలిపారు. నక్సలిజంపై మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కఠిన వైఖరి కారణంగా గత నాలుగు దశాబ్దాల్లో తొలిసారి పౌరులు, భద్రతా బలగాల మరణాల సంఖ్య 100 లోపునకు పడిపోయిందని వివరించారు. 'నక్సల్ రహిత.. డ్రగ్ రహిత ఇండియా' కలను సాకారం చేయడంలో చత్తీస్‌గఢ్ పోలీసుల కృషిపై హోంమంత్రి ప్రశ్నంసలు కురిపించారు. వారి సహకారాన్ని సువర్ణాక్షరాలతో లిఖించాలని కొనియాడారు. మిగిలిన నక్సలైట్లు కూడా హింసా మార్గాన్ని విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో కలసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. మీరు లొంగిపోవాలని, జనజీవన స్రవంతిలో కలవాలని చేసిన ప్రయత్నాలు ఫలించినందుకు తాను ఈ రోజు చాలా సంతోషంగా ఉన్నానని అమిత్ షా పేర్కొన్నారు.

# నెహ్రూ లేఖలను తిరిగిచ్చేయండి..
# రాహుల్ గాంధీకి 'ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం' లేఖ

మొదటి పేజి తరువాయి

ఐన్‌స్టీన్‌తో పాటు పలువురు ప్రముఖులకు, నెహ్రూకు మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయని వెల్లడి

**న్యూఢిల్లీ,:** భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ రాసిన వ్యక్తిగత లేఖలను సోనియా గాంధీ తీసుకున్నారని, వాటిని తిరిగి ఇచ్చేయాలంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి 'ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం అండ్ లైబ్రరీ(పీఎంఎంఎల్)' అధికారికంగా లేఖ రాసింది. యూపీఏ ప్రభుత్వ హయాంలో 2008లో సోనియా ఈ లేఖలను తీసుకున్నారని పేర్కొంది. సెప్టెంబరులో సోనియా గాంధీకి ఇదే విషయమై 'ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం' ఒక లేఖ రాసింది. తాజాగా డిసెంబర్ 10న రాహుల్ గాంధీకి లేఖ రాయడం గమనార్హం. లేఖలను అసలు రూపంలో తిరిగి ఇచ్చినా లేదా డిజిటల్ కాపీల రూపంలో అందించినా ఫర్వాలేదని పీఎంఎంఎల్ సభ్యుడు రిజ్వాన్ కద్రీ కోరారు. అత్యంత చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ఈ లేఖలను 1971లో మ్యూజియానికి అప్పగించారు. అయితే, 2008లో వాటిని 51 పెట్టెల్లో ప్యాక్ చేసి సోనియా గాంధీకి పంపినట్లు తెలుస్తోంది. కాగా, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, మౌంట్ బాటన్, పద్మజా నాయుడు, జయప్రకాశ్ నారాయణ్, అరుణ అసఫ్ అలీ, విజయ లక్ష్మీ పండిట్, బాబూ జగ్జీవన్ రామ్, గోవింద్ బల్లబ్ పంత్ వంటి ప్రముఖులకు, జవహర్ లాల్ నెహ్రూకు మధ్య జరిగిన ఈ ఉత్తర ప్రత్యుత్తరాలు చారిత్రక ప్రాముఖ్యత కలిగివున్నాయని ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం పేర్కొంది. ఈ లేఖలను తిరిగి పొందడంలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సాయం చేయాలని రిజ్వాన్ కద్రీ కోరుతున్నారు.

# ప్రధాని మోదీతో శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకే భేటీ..!

మొదటి పేజి తరువాయి

**న్యూఢిల్లీ,:** శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే మూడురోజుల పర్యటన కోసం ఆదివారం భారత్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, రక్షణ, వాణిజ్యం, పెట్టుబడుల అంశంపై ప్రధాని నరేంద్ర మోదీతో సోమవారం విస్తృత చర్చలు జరిపారు. శ్రీలంక అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత దిసనాయకే తొలి విదేశ పర్యటన ఇదే. చర్చలకు ముందు ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతోనూ భేటీ అయ్యారు. ప్రధాని మోదీ, అనుర దిసానాయక్ మధ్య జరిగిన చర్చలకు సంబంధించిన వివరాలను విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వివరించారు. ఇరుదేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, భద్రతా సహకారంపై జరిగినట్లు తెలిపారు. విదేశాంగ మంత్రి జైశంకర్ సైతం సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. భారత్‌లో తొలిసారిగా పర్యటిస్తున్న దిసనాయకేను కలవడం ఆనందంగా ఉందన్నారు. నైబర్‌హుడ్ ఫస్ట్ విధానం, సాగర్ ఔట్‌లుక్‌కి శ్రీలంక కీలకమైందని.. ప్రధాని మోదీ, దిసనాయక మధ్య చర్చలు విశ్వాసం, సహకారాన్ని పొందిస్తాయని ఆశిస్తున్నానన్నారు. విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ జరిపిన చర్చల్లో పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన విషయాలపై చర్చించినట్లు దిసనాయకే పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఢిల్లీకి చేరుకోగా.. కేంద్ర మంత్రి ఎల్ మురుగన్‌తో పాటు అధికారులు స్వాగతం పలికారని సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు.

# ఏ జిల్లానూ రద్దు చేయబోవడం లేదు

మొదటి పేజి తరువాయి

**హైదరాబాద్, :**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏ జిల్లాను కూడా రద్దు చేయబోదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ... ఏ జిల్లాను రద్దు చేయబోమని, అసలు పాత జిల్లాలను రద్దు చేసే ఆలోచనే తమ ప్రభుత్వానికి లేదని వెల్లడించారు. ముఖ్యమంత్రి పలుమార్లు ఢిల్లీకి వెళుతున్నారని, కానీ నిధులు తెచ్చారా? అని బీఆర్ఎస్ నేతలు చేస్తోన్న విమర్శలపై కూడా మంత్రి స్పందించారు. ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా కేంద్రం వద్దకు తరచూ నిధుల కోసం వెళ్లడం సాధారణ విషయమేనని, కానీ వెళ్లిన ప్రతిసారీ నిధులు రావని గుర్తించాలన్నారు. తెలంగాణ వచ్చాక పదేళ్లు బీఆర్ఎస్ పాలించిందని, వారి హయాంలో కేంద్రం నుంచి తెలంగాణకు ఎన్ని నిధులు తీసుకువచ్చారో అందరికీ తెలుసని విమర్శించారు. తమది పేదల ప్రభుత్వమన్నారు. పేదల కోసం అనునిత్యం పని చేస్తామన్నారు.

# తెలంగాణకు వెళితే చికున్ గున్యా వస్తుందని
# అమెరికాలో చెప్పుకుంటున్నారు

మొదటి పేజి తరువాయి

**హైదరాబాద్, :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. సమావేశాలు వాడీవేడిగా కొనసాగుతున్నాయి. ప్రశ్నోత్తరాల సమయంలో సభలో బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. కేంద్ర నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదోవ పట్టిస్తోందని హరీశ్ రావు విమర్శించారు. సర్పంచ్ లకు బిల్లులు ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని మండిపడ్డారు. బిల్లులు రాక సర్పంచ్ లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. బంగారాన్ని తాకట్టు పెట్టి సర్పంచ్ లు పనులు చేశారని చెప్పారు. తెచ్చిన అప్పులకు వడ్డీ కట్టలేని దీన స్థితిలో సర్పంచ్ లు ఉన్నారని అన్నారు. తెలంగాణకు వెళితే చికున్ గున్యా వస్తుందని అమెరికాలో చెప్పుకుంటున్నారని... ఇది తెలంగాణ రాష్ట్రానికి అవమానమని హరీశ్ రావు అన్నారు. ఎస్సీ, ఎస్టీ నిధులు విడుదల కావడం లేదని చెప్పారు. పంచాయతీలకు నిధులు ఇవ్వడం లేదని విమర్శించారు. గ్రామ పంచాయతీలను బలోపేతం చేస్తామని చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. గత 9 నెలలుగా గ్రామ పంచాయతీ ఉద్యోగులకు, సర్పంచ్ లకు జీతాలు లేవని చెప్పారు. బిల్లులు, జీతాలను ఎప్పటిలోగా క్లియర్ చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. తెలంగాణ పల్లెలను కేసీఆర్ దేశానికే ఆదర్శంగా నిలిపారని హరీశ్ రావు కొనియాడారు. గ్రామాలను కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడా కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లులు క్లియర్ అవుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు.

# సచివాలయంలో ముగిసిన చంద్రబాబు, పవన్ భేటీ

మొదటి పేజి తరువాయి

**అమరావతి,:** ఏపీ సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సచివాలయంలో భేటీ అయ్యారు. చంద్రబాబు పోలవరం పర్యటన ముగించుకుని రాగానే, ఆయనను పవన్ వెళ్లి కలిశారు. చంద్రబాబు, పవన్ మధ్య సమావేశం దాదాపు 40 నిమిషాల పాటు సాగింది. తన సోదరుడు నాగబాబుకు మంత్రి పదవిని ఇవ్వడంపై పవన్... సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపినట్టు తెలుస్తోంది. నాగబాబు ప్రమాణస్వీకారం అంశంపైనా చర్చించినట్టు సమాచారం. అంతేకాకుండా, కూటమి పార్టీల మధ్య కిందిస్థాయి నేతల వరకు సమన్వయం కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. తాజా రాజకీయ పరిణామాలు, మిగిలిన నామినేటెడ్ పదవులకు తుది జాబితా రూపకల్పన, ఇతర అంశాలపైనా ఇరువురు నేతలు చర్చించారు. అంతేకాదు, సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి ఘనవిజయం అంశం కూడా చంద్రబాబు, పవన్ మధ్య చర్చకు వచ్చింది. రాబోయే సహకార సంఘాల ఎన్నికల్లో కూడా ఇదే విధంగా సమన్వయంతో ముందుకెళ్లాలని తీర్మానించారు.

# సొంత జిల్లాలో జగన్ కు భారీ షాక్



మొదటి పేజి తరువాయి

పవర్ లో ఉన్నప్పుడు తమను పట్టించుకోలేదని.. తాము అడిగిన పనులను చేసేందుకు ఆసక్తి చూపలేదని మండిపడుతున్నారు. దీనికి తోడు ఈ నెల ఏడున కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాధవీ రెడ్డికి వేదికపై కుర్చీ వేకపోవటం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. ఈ ఘటన తర్వాత టీడీపీ నేతలు ఈఇష్యూను సీరియస్ గా తీసుకోవటంతో పాటు.. ఎమ్మెల్యే కుర్చీ తొలగించిన వారికి అక్కడ కుర్చీ లేకుండా చేయాలన్న లక్ష్యంగా పని చేసినట్లుగా చెబుతున్నారు. అధికారం చేజారిన తర్వాత ఆచితూచి అన్నట్లుగా వ్యవహరించాల్సిన తీరుకు భిన్నంగా వైసీపీ నేతల తీరు కారణంగా పార్టీకి భారీ నష్టం కలిగేలా పరిణామాలు చోటు చేసుకుంటున్నట్లుగా చెబుతున్నారు. వైసీపీ అగ్రనాయకుల మీద కార్పొరేటర్లకు ఉన్న అసమ్మతి కలిసి వచ్చిందని చెబుతున్నారు. గడిచిన కొద్దిరోజులుగా సాగిన ఆపరేషన్ చివరకు ఎనిమిది మంది కార్పొరేటర్లు పార్టీ మారేందుకు ఓకే చెప్పటంతో కడప వైసీపీకి భారీ దెబ్బగా అభివర్ణిస్తున్నారు.

# రాష్ట్రంలో ఢిల్లీ టూరిజం.. జైలు టూరిజం బాగా నడుస్తోంది..

మొదటి పేజి తరువాయి



అందుకే తెలంగాణ శాసనసభ కార్య విధాన మరియు కార్యక్రమ నిర్వహణ నియమావళిలోని 168 (1) నిబంధన ప్రకారం బీఆర్ఎస్ శాసనసభా పక్షం తరపున ఆర్థిక మంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యేల హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న అంశంలోనూ సభా హక్కుల నోటీసులు ఇచ్చామని తెలిపారు. లగచర్ల వంటి బాధాకరమైన సంఘటన జరిగినప్పుడు, టూరిజంపైన అసెంబ్లీలో చర్చ పెట్టడం ప్రభుత్వ ప్రాధాన్యతలకు అద్దం పడుతుందని కేటీఆర్ విమర్శించారు. లగచర్ల అంశంపై శాసనసభలో చర్చించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశామని తెలిపారు. అసలైన అప్పులతో రాష్ట్ర ప్రభుత్వం సవరణ స్టేట్‌మెంట్ ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సవరణ ఇవ్వని పక్షంలో సభా హక్కుల ఉల్లంఘన తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని కోరారు. గతంలో తానే స్వయంగా అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డిపై ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్‌ను అప్పటి స్పీకర్ మనోహర్ అంగీకరించారని గుర్తుచేశారు. దానిపై అప్పుడు సభలో చర్చ జరిగిందని పేర్కొన్నారు. గతంలో ఉన్న పద్ధతులు, సాంప్రదాయాలకు అనుగుణంగా ప్రివిలేజ్ మోషన్ కు అనుమతి ఇవ్వాలని స్పీకర్‌ను విజ్ఞప్తి చేశామని తెలిపారు. గతంలో ఉన్నటువంటి సాంప్రదాయాలను పరిగణలోకి తీసుకుని సభా హక్కుల ఉల్లంఘన తీర్మానానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ శాసనసభలో అనుమతి ఇస్తారని ఆశిస్తున్నానని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర కాంగ్రెస్ నేతలు అప్పులపై బయట కూడా అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. 7 లక్షల కోట్ల అప్పు అంటూ లేని అప్పు గురించి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీళ్లు చెబుతున్న అప్పుల లెక్కలు తప్పు కాబట్టి.. ఈ ప్రభుత్వం కడుతున్నామని చెబుతున్న నెలకు 6వేల 500 కోట్ల వడ్డీ లెక్కలు కూడా తప్పే అని స్పష్టం చేశారు. ఏడాదికి కేవలం రూ.22 వేల కోట్ల వడ్డీ మాత్రమే కడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉండగా కేవలం టూరిజంపైనే రాష్ట్ర ప్రభుత్వం చర్చకు స్వీకరించడం బాధాకరమని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో ఢిల్లీ టూరిజం, జైలు టూరిజం బాగా నడుస్తున్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు ఢిల్లీకి 100కి పైగా చేసిన పర్యటనలతో ఢిల్లీ టూరిజం బాగా పెరిగిందని విమర్శించారు. మరోవైపు 40 మంది లగచర్ల రైతులను జైలులో పెట్టడం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న సోషల్ మీడియా కార్యకర్తల నుంచి మొదలుకొని పార్టీ నాయకులను జైల్లో పెడుతున్న జైలు టూరిజం.. బెయిల్ వచ్చిన తర్వాత కూడా నటులను జైలులో ఉంచుతున్న జైలు టూరిజం.. ప్రభుత్వ పథకాలపై మాట్లాడుతుంటే జైలుకు పంపిస్తామని ముఖ్యమంత్రి చేస్తున్న జైలు టూరిజం.. ఈ విధంగా తెలంగాణలో జైలు టూరిజం బాగా నడుస్తుందని అన్నారు. సర్పంచ్‌ల సమస్యలపై కూడా శాసన సభలో చర్చకు లేవనెత్తామని కేటీఆర్ తెలిపారు. సర్పంచ్‌లకు ఇవ్వాల్సిన రూ.600 కోట్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ తరపున డిమాండ్ చేశామన్నారు. గత నెలలో బడా కాంగ్రాక్టర్లకు ఇచ్చిన రూ.1200 కోట్ల నిధుల్లో సగం ఇస్తే.. సర్పంచ్‌ల సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాలని స్పీకర్ కు కూడా విజ్ఞప్తి చేశామని నచెప్పారు. లగచర్ల అంశంపై కూడా సభలో చర్చించాలని స్పీకర్‌ను కోరినట్లు కేటీఆర్ తెలిపారు. రైతులను అక్రమంగా జైలులో ఉంచిన కాంగ్రెస్ సర్కార్ తీరుపై రాష్ట్ర ప్రజలు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ వైఖరిని శాసన సభలో తెలియజేయాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణలో హరిత విప్లవం దిశగా కీలక అడుగులు..
# సీఎం రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం..!

మొదటి పేజి తరువాయి



ప్రపంచవ్యాప్తంగా సవాలుగా మారుతోన్న వాతావరణ మార్పులను అధిగమించేందుకు రేవంత్ రెడ్డి ఈ దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించారు. కాలుష్య నియంత్రణ, పర్యావరణ పునరుద్ధరణ, పునరుత్పాదక ఇంధనం తోపాటు తెలంగాణకు పచ్చదనం భవిష్యత్ తరాలకు అందించేందుకు కీలక ముందడుగు వేశారు. పర్యావరణ పునరుద్ధరణలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ముఖ్యమైన ప్రాజెక్టుల్లో సరస్సులు, చెరువుల పునరుద్దరణ ప్రధానమైంది. ఒకప్పుడు చెరువులకు, సరస్సులకు పెట్టింది పేరైన భాగ్యనగరంలో కబ్జాల కారణంగా చెరువులు, కుంటలు కుదించుకుపోయి, ఉనికిని కోల్పోతున్నాయి. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే హైడ్రా పేరుతో ప్రత్యేక వ్యవస్థను ప్రవేశపెట్టారు. దీంతో చెరువుల్లోని అక్రమ కట్టడాలను పని పడుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరు 75 చెరువుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ మహానగరం పరిధిలోని మొత్తం 2000 చెరువుల రూపురేఖలు మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా నిర్జీవమైన నీటి వనరులను పునరుద్ధరించనున్నారు. జీవవైవిధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు భూగర్భ జలాలు నిండేలా ప్రణాళికలు చేస్తున్నారు. వలస పక్షులను తిరిగి తెలంగాణ గడ్డపై విహరించేలా ఫ్లాన చేస్తున్నారు. చెరువులకు కొత్త శోభ తీసుకురావడంతో ఫ్లెమింగోలు, రెడ్ బ్రెస్టెడ్ ఫ్లైక్యాచర్ వంటి జాతులకు చెందిన పక్షులు తిరిగిరావాలని భావిస్తున్నారు. పర్యావరణ పునరుద్ధరణతో పాటు మానవాళికి ఎంతో ప్రయోజనం చేకూర్చనుందని ప్రకృతి ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు. జీవ వైవిధ్యానికి సరైన చిరునామా అమీన్‌పూర్ చెరువు. రకరకాల పక్షులు, జంతువులకు నిలయం ఇది. ఏకంగా 350 ఎకరాల్లో విస్తరించిన అమీన్‌పూర్ చెరువు.. పెద్దచెరువు, కొత్తచెరువు, కొమ్ముచెరువు అనే మూడు చెరువుల గొలుసుకట్టు. ఇంత పెద్ద చెరువును కబ్జాలకు గురైంది. పెద్ద చెరువు నుంచి తూముల ద్వారా వచ్చే నీటిని సైతం కబ్జాదారులు మూసివేశారు. కొత్త చెరువును దాదాపు ఆనవాళ్లు లేకుండా చేశారు. ఈ మధ్య పెద్ద చెరువుకు సబంధించిన అలుగు, తూములు మూసివేయడంతో వర్షం వచ్చినప్పుడు ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బందిపడుతున్నారు అమీన్‌పూర్ వాసులు. దీనికితోడు పశు పక్షాదులకు నిలయమైన అమీన్‌పూర్ వలస పక్షులు అంతరించిపోతున్నాయి. చెరువు వద్దకు రావడమే మానేశాయి. ఈ నేపథ్యంలో చెరువుల పరిరక్షణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. పర్యావరణాన్ని కాపాడి భవిష్యత్ తరాలకు అందించాలని సంకల్పించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమీన్‌పూర్ చెరువు వద్ద కనిపించిన అరుదైన రెడ్ ఫ్లైక్యాచర్‌కు సంబంధించిన చిత్రాన్ని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. పర్యావరణ పునరుద్ధరణ కోసం సాగుతోన్న కార్యక్రమాలకు ఇది సాక్ష్యమని సీఎం ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. అమీన్ పూర్ చెరువుకు పూర్వవైభవం రావటమే కాకుండా.. జీవ వైవిద్యం కూడా తిరిగి సంతరించుకుంది. ఇందుకు నిదర్శనమే.. ఫ్లైక్యాచర్ లాంటి అరుదైన జాతి పక్షులు ఇక్కడికి విచ్చేయటమే అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. కాగా.. అమీన్‌పూర్ చెరువు ఒకప్పుడు ఫ్లెమింగో పక్షులతో పాటు ఇతర జాతి పక్షులకు ఆవాసంగా ఉండేది. మారిన వాతావరణ పరిస్థితులు, ఆక్రమణలు, ఇలా రకరకాల కారణాలతో కొన్నేళ్లుగా పర్యావరణ సవాళ్లను ఎదుర్కొంటోంది అమీన్ పూర్ చెరువు. సీఎం రేవంత్ రెడ్డి హయాంలో వచ్చిన హైడ్రాతో ఈ చెరువుకు మరోసారి పునరుజ్జీవం వచ్చినట్లైంది.

# కొరుకుడుపడని కొయ్యగా మారిన దేశ రాజధాని..

మొదటి పేజి తరువాయి



వరుసగా రెండు పర్యాయాలు గెలిచి అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ ను ఈ సారి ఎలాగైనా నిలువరించాలి ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో పార్టీ ఓటుబ్యాంకును కాపాడుకోవడంతో పాటు సామాజిక సమీకరణాలు, భావోద్వేగ అంశాలను తెరపైకి తెస్తోంది. మరోవైపు బీజేపీ, దాని అనుబంధ సంఘాలు, సంఘ్ పరివార్ ఢిల్లీలోని ప్రతి ఇంటినీ చుట్టేసే ప్రయత్నాలు చేస్తున్నాయి. తాజాగా జరిగిన 4 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో హర్యానా, మహారాష్ట్రలో అనూహ్య విజయం సాధించిన కమలదళం ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలుపొంది దశాబ్దాలుగా అందకుండా పోతున్న అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలని చూస్తోంది. ఎన్నికల తేదీలు ఇంకా ప్రకటించక ముందే అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన ప్రాథమిక కసరత్తు ఇప్పటికే పూర్తిచేసింది. త్వరలోనే మొత్తం 70 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది.

పకడ్బందీగా అభ్యర్థుల ఎంపిక

ఏ పార్టీకైనా తమ సొంత బలానికి తోడు అభ్యర్థుల బలం కూడా తోడైతేనే విజయం వరిస్తుంది. అందుకే అన్ని రాజకీయ పార్టీలు బలమైన అభ్యర్థుల కోసం గాలం వేస్తుంటాయి. ఈ క్రమంలోనే పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల విషయంలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల ఎంపికపై తీవ్ర కసరత్తు చేసింది. క్షేత్రస్థాయిలో బలమైన ముద్ర, ఓటర్లలో ఆదరణ కలిగిన నేతలకు టికెట్ ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే వరుసగా 2 పర్యాయాలు ఓడిపోయిన నేతలకు ఈసారి టికెట్ ఇవ్వడం లేదు. మరోవైపు మీనాక్షి లేఖి, పర్వేశ్ వర్మ, రమేశ్ బిధూరి వంటి నగరవ్యాప్త ప్రభావం కలిగిన సీనియర్ నేతలను ఆమ్ ఆద్మీ పార్టీ కి వ్యతిరేకంగా ఎన్నికల వాతావరణాన్ని తయారుచేయగలరని అధినాయకత్వం భావిస్తోంది. ఎన్నికల ప్రచారంలో వారికి కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయి. వారితో పాటు ఆమ్ ఆద్మీ పార్టీని వీడి బీజేపీలో చేరిన రాష్ట్ర మాజీ మంత్రి కైలాష్ గెహ్లోట్‌కు జాట్ సామాజికవర్గంలో గట్టి పట్టుంది. ఆయనను నజఫ్‌గఢ్ నుంచి బరిలోకి దించే అవకాశాలున్నాయి. మాజీ ముఖ్యమంత్రి మదన్‌లాల్ ఖురానా కుమారుడు హరీష్ ఖురానాను మోతీనగర్ నుంచి పోటీ చేయించవచ్చు. మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడంతో పాటు కొత్త ముఖాలను పరిచయం చేయడం కోసం సగం స్థానాలను కొత్తవారికి కేటాయించనున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అంటే కనీసం 35 స్థానాల్లో కొత్త అభ్యర్థులు బరిలోకి దిగే అవకాశాలున్నాయి. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో "చావో రేవో" అన్నట్టుగా శ్రమించిన కమలదళం.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను అంతకంటే సీరియస్‌గా తీసుకుని పోరాడాలని చూస్తోంది.

కోర్ ఓట్‌బ్యాంకు విస్తృతికి వ్యూహం


ఢిల్లీలో భారతీయ జనతా పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో 30 శాతాన్ని మించిన ఓటుబ్యాంకు ప్రతిసారీ ఉంటోంది. నగరంలోని వ్యాపారవర్గాలు బీజేపీకి ఎల్లవేళలా మద్ధతుగా నిలుస్తున్నారు. వారితో పాటు విద్యాధిక వర్గాలు, కొన్ని సామాజికవర్గాలు బీజేపీకి బలమైన ఓటుబ్యాంకుగా నిలిచాయి. అయితే ప్రత్యర్థి ఆమ్ ఆద్మీ పార్టీ ఏకంగా 50 శాతాన్ని మించి ఓటుబ్యాంకు కైవసం చేసుకుంటున్నప్పుడు ఈ బలం సరిపోదు. అందుకే ఈసారి ఓటుబ్యాంకును విస్తరించుకోవడంపై కమలనాథులు దృష్టి పెట్టారు. తమ ఓటుబ్యాంకు చేజారకుండా కాపాడుకోవడం ఒకెత్తయితే.. కొత్త ఓటుబ్యాంకును సృష్టించుకోవడం మరో ఎత్తు. కొత్త ఓటుబ్యాంకు తయారు చేసుకోవాలి అంటే ప్రత్యర్థి ఓటుబ్యాంకును చెదరగొట్టి తమవైపు ఆకట్టుకోవాలి. ఢిల్లీలోని మురికివాడల్లో నివసించే పేద, నిరుపేద ఓటర్లు ఆమ్ ఆద్మీ పార్టీ కు బలమైన ఓటు బ్యాంకుగా ఉన్నారు. ఈ క్రమంలో ఢిల్లీలోని 1,194 బస్తీలు, మురికివాడల్లో రాత్రి పూట పార్టీ నేతలు గడిపేలా కార్యక్రమాలు రూపొందించారు. ఇప్పటికే పలువురు నేతలు బస్తీ నిద్రలు చేస్తున్నారు. తద్వారా బస్తీ ప్రజల సమస్యలు తెలుసుకుని, వారికి భరోసా కల్పించవచ్చని భావిస్తున్నారు. ఉచిత పథకాలకు ఆకర్షితులై ఆమ్ ఆద్మీ పార్టీకి ఓటేస్తున్నవారిలో ఇలాంటి బస్తీ ఓటర్లే ఎక్కువ సంఖ్యలో ఉన్నారని పార్టీ నాయకత్వం గ్రహించింది. అందుకే బస్తీ ఓటర్లను లక్ష్యంగా చేసుకుని వివిధ రకాల ప్రచార కార్యక్రమాలను రూపొందించుకుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించి చెప్పడంతో పాటు వారి అవసరాలకు తగ్గ హామీలను మేనిఫెస్టోలో చేర్చేందుకు ప్రయత్నిస్తోంది.

తెరవెనుక సంఘ్ వ్యూహాలు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ హర్యానా, మహారాష్ట్రలో మాదిరిగా తెరవెనుక అనేక వ్యూహాలను అమలు చేస్తోంది. ఆరెస్సెస్ జాయింట్ జనరల్ సెక్రటరీ అరుణ్ కుమార్ ఢిల్లీలోనే మకాం పెట్టి అనేక సమావేశాలు నిర్వహించారు. బీజేపీ – ఆరెస్సెస్ మధ్య మెరుగైన సమన్వయం కోసం ప్రయత్నిస్తున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ స్థాయికి తగ్గ నేత ప్రస్తుతం ఢిల్లీ బీజేపీలో లేరని ఆరెస్సెస్‌కు కూడా తెలుసు. అయితే వరుసగా పదేళ్లు అధికారంలో ఉన్న ఆప్ సర్కారుపై ప్రజల్లో ఏర్పడ్డ వ్యతిరేకతను కేజ్రీవాల్‌పై అస్త్రంగా మలచుకోవాలని చూస్తోంది. ప్రజలకు పరిమిత యూనిట్ల వరకు ఉచిత కరెంట్, ఉచిత నల్లా నీరు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి ప్రజాకర్షక ఉచిత పథకాలతో ఓటర్లను ఆకట్టుకుంటూ రెండు పర్యాయాలు అధికారం సాధించిన ఆమ్ ఆద్మీ పార్టీ, రోడ్లు, మురుగునీటి నిర్వహణ, తాగునీటి సరఫరా విషయంలో విమర్శలు ఎదుర్కొంటోంది. ఢిల్లీ మద్యం పాలసీ అక్రమాల కేసు ద్వారా కేజ్రీవాల్‌పై ఇంతకాలం ఉన్న 'నీతి–నిజాయితీ' ముద్ర కూడా చెరిగిపోయింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ సైతం పునర్ వైభవం కోసం శ్రమిస్తోంది. ఢిల్లీలో ఆప్ ఎదుగుదల కాంగ్రెస్ పార్టీనే తీవ్రంగా దెబ్బతీసింది. ఆ పార్టీ ఓటుబ్యాంకు పూర్తిగా చెల్లాచెదురైపోయింది. ఈ సారి కాంగ్రెస్ పార్టీ ఆప్‌తో కలిసి పోటీ చేయడం లేదు. తద్వారా మైనారిటీలు, మరికొన్ని వర్గాల ఓట్లను కాంగ్రెస్ చీల్చడం కూడా బీజేపీకి కలిసొచ్చే అవకాశం ఉంది. వీటన్నింటినీ సద్వినియోగం చేసుకుంటే అధికారం చేజిక్కించుకోవడం కష్టమేమమీ కాదని కమలదళం అంచనా వేస్తోంది.

# 'పాలస్తీనా' బ్యాగ్‌తో ప్రియాంకగాంధీ... బీజేపీ నేతల చురకలు

### సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కాంగ్రెస్ అధికార ప్రతినిధి
### పార్లమెంట్ ఆవరణలో పాలస్తీనా అనుకూల బ్యాగ్‌తో ప్రియాంక
### వార్తల్లో నిలిచేందుకు ఇలా చేస్తుంటారని బీజేపీ నేత విమర్శ




**న్యూఢిల్లీ,:**వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ సోమవారం పాలస్తీనా అని రాసి ఉన్న బ్యాగ్‌తో లోక్ సభకు హాజరయ్యారు. పాలస్తీనా సంఘీభావానికి చిహ్నంగా భావించే పుచ్చకాయ, శాంతి చిహ్నాలు ఆ బ్యాగ్‌పై ఉన్నాయి. పార్లమెంట్ ఆవరణలో ప్రియాంక గాంధీ ఆ బ్యాగ్‌తో దిగిన ఫొటో నెట్టింట వైరల్‌గా మారింది. ఈ ఫొటోను కాంగ్రెస్ అధికార ప్రతినిధి షామా మహమ్మద్ సోషల్ మీడియా వేదికపై పోస్ట్ చేశారు. ప్రియాంక గాంధీ తీసుకెళ్లిన ప్రత్యేక బ్యాగ్... పాలస్తీనాకు ఆమె మద్దతు, సంఘీభావాన్ని చూపుతోందని, కరుణ, న్యాయం, మానవత్వం పట్ల నిబద్ధతకు ఇది చిహ్నం అని షామా పేర్కొన్నారు. తద్వారా జెనీవా ఒప్పందాన్ని ఎవరూ ఉల్లంఘించలేరని ఆమె స్పష్టం చేశారని రాసుకొచ్చారు. ప్రియాంక గాంధీ ఆ బ్యాగ్‌తో కనిపించడంపై బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు. వార్తల్లో నిలిచేందుకు కొందరు ఇలాంటి పనులు చేస్తుంటారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినప్పుడు, వారు అలాంటి చర్యలను ఆశ్రయిస్తారని విమర్శించారు. గాంధీ కుటుంబం ఎప్పుడూ బుజ్జగింపుల సంచిని మోస్తుంటుందని బీజేపీ నేత సంబిత్ పాత్ర విమర్శించారు. ఎన్నికల్లో వారి ఓటమికి బుజ్జగింపుల సంచే కారణమని చురక అంటించారు.

# డి ఎం ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం



అమరచింత వనపర్తి డిసెంబర్ 16 జనం రిపోర్టర్: అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేకమైన ప్రేరణ తరగతులు జరుగుతున్నాయి. ఈ ప్రేరణ తరగతులకు హాజరైన విద్యార్థులకు ప్రతిరోజు దేశాయి మురళీధర్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్ దేశాయి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాల నుంచి 40 మంది విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం అల్పాహారం అందిస్తున్నట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడు శ్యాం కుమార్ తెలిపారు. అందులో భాగంగా సోమవారం ఉదయం 10వ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందజేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్, ఆదాం ,విమల మేడం శారద మేడం సింగిల్ విండో డైరెక్టర్ చిన్న వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న దద్దాల

**దద్దాలకు ఘనస్వాగతం పలికిన కౌన్సలర్ కుటుంబ సభ్యులు**



(కనిగిరి డిసెంబర్ 16 జనంరిపోర్టర్ ): కనిగిరి మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిల్లర్ షైక్ కరీమున్నిషా,ఖాసీంషాల నూతన గృహప్రవేశం కార్యక్రమంలో కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ సోమవారం పాల్గొన్నారు. వారికీ నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న దద్దాలకు వార్డు కౌన్సలర్ కుటుంబసభ్యులు ఘనస్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, వైస్ చైర్మన్ మాణిక్యాల రావు, కౌన్సిల్లర్లు తమ్మినేని సుజాత రెడ్డి, రామణబోయిన శ్రీను,దేవరాజు,షఫీ,రిటైర్డ్ హెడ్ మాస్టర్ షైక్ మస్తాన్ వలి,మాజీ ఎంపీటీసీ డిష్ జిలాని,కో-ఆప్షన్ సభ్యులు ఖాజా మొహిద్దీన్,ఏఎంసి మాజీ డైరెక్టర్ బొట్టు శ్రీను, పసుపులేటి అరుణోధర్, గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి,షైక్ చిన్న ఖాసీంషా, మదార్ వలి,ఈర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు

## అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ వారి ఆధ్వర్యంలో వృద్దులకు దుప్పట్లు పంపిణీ






**గుంటూరు జిల్లా /డిసెంబర్ 16(జనం రిపోర్టర్):** తెనాలి బండి వసిత పుట్టినరోజు సందర్భంగా వారి తల్లితండ్రులు బండి వెంకట సుబ్బయ్య ఈశ్వరి మరియు అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు పి. ప్రభాకర్ సహకారంతో అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ వారి ఆధ్వర్యంలో మురికివాడాలో చలికి వణుకుతూ రోడ్డు సైడ్ నివసిస్తున్న వృద్దులకు, యాచకులకు దుప్పట్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ బండి వసిత పుట్టినరోజు సందర్భంగా వారి తల్లితండ్రులసహకారంతో వృద్ధులకు దుప్పట్లు అందజేశామని ఈ కార్యక్రమానికి సహకారం అందించిన వెంకట సుబ్బయ్య ఈశ్వరి మరియు, అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ అధ్యక్షులు పి. ప్రభాకర్ కు ధన్యవాదములు తెలిపారు.

## భాదితులకు స్థిరస్తి అమ్మి ఇస్తాను అని చెప్పిన కాంగ్రెస్ తెరాస పెద్దలు వ్రాసిన భూమి ఎక్కడ ఉన్నదో చూపించాలే



**ఏటూరునాగారం /డిసెంబర్ 16(జనం రిపోర్టర్):** ఏటూరునాగారం మండల కేంద్రం లో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికారప్రతినిధి మాట్లాడుతూ 3 కోట్ల రూపాయలు 300వందల మందికి అమ్మి ఇస్తామని కాగితాలు వ్రాసిన పెద్దలే భాదితులకు చెందవలసిన2కోట్ల రూపాయలు భూమిని ఆక్రమించుకున్నా లింగం నరసింహ రావు కు మరియు ప్రభుత్వఉద్యోగం చేస్తూనే అవినీతి అక్రమాలకు పాల్పడిసస్పెండ్కుగురైన జగ్గరామ్ నాయక్ ఫ్యామిలీ ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి మద్దతుగా ఉన్నా కాంగ్రెస్ తెరాస నాయకులు వ్రాసి ఇచ్చిన భూమి ఎక్కడ ఉన్నదొ చూపించాలని అన్నారు ఇప్పటికైనా ఏటూరునాగారం మండలమేధావులు పత్రిక మిత్రులు ప్రజలు ఒక్కసారి ఆలోచించండి భాధితులకమిటి పేరుతో కాంగ్రెస్ తెరాస పెద్దలు భాదితులకు3కోట్ల రూపాయలు 300వందల మంది భాదితులకు రామాలయం దగ్గర భాదితులకమిటీ వేసి కేసు విత్ర కావడం కోసం స్తిరస్థులు అమ్మి ఇస్తామని కాగితం వ్రాసినపెద్దలు భూమి ఎక్కడ ఉన్నదో చూపకుండా దొషులకు అండగాఉండి భాధితులను అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదాని అన్నారు అదేవిదంగా ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన ఆదివాసీ దళిత బహుజన మైనార్టీ నిరుపేదలైన భాదితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పార్టీ భాదితులకు ఎప్పుడు అండగానే ఉంటదని అన్నారు అదేవిదంగా ఎఫ్ ఐ ఆర్ లో భీనామీ అని వ్రాసిన భూమి భాదితులకు చెందవలసి ఉండాలి కానీ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్ ములుగు స్థానిక ఎమ్మెల్యే తెలంగాణ పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షమా శాఖ మంత్రి అనూషర్లు అధికారం అడ్డుపెట్టుకొని ఆదివాసీ దళిత బహుజన మైనార్టీ వర్గాల 300 వందల మందికి చెందవలసిన భూమి దోషులకు కట్టబెట్టాలని చూస్తే కాగితం వ్రాసిన పెద్దల ఇండ్ల ముందే భాదితులకు న్యాయం జరిగే వరకు ఇండ్ల ముందే కూర్చుంటామని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డా జాడి రామరాజు నేత అన్నారు ఈ కార్యక్రమం లో భాదితుల కుటుంబాలు పాల్గొన్నారు

## ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థిని విద్యార్థులకు అలవెన్స్ పంపిణీ



(కనిగిరి డిసెంబర్ 16 జనం రిపోర్టర్ ): సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి భవిత ప్రత్యేక అవసరాలు కలిగిన 0 %శ% 18 సంవత్సరాల విద్యార్థినీ విద్యార్థులకు ఇంటి వద్ద విద్య, గర్ల్స్ స్టైఫండ్, ఎస్కార్ట్ అలవెన్స్, ట్రాన్స్పోర్ట్ అలవెన్స్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కనిగిరి మండలం నందు ఉన్నటువంటి భవిత ప్రత్యేక అవసరాలు గల పిల్లల పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. సంజీవి గారి అధ్యక్షతన నిర్వహించటం జరిగినది. 2024-25 సంవత్సరానికి సంబంధించి విడుదలైనటువంటి అలవెన్సును అందించడం జరిగినది మరియు విద్యార్థిని విద్యార్థులకు కనిగిరి యూత్ వారి సహకారంతో దుప్పట్లు, నోట్ బుక్స్, పెన్నులు, తల్లిదండ్రులకు 100 మందికి ఉచితంగా అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. సంజీవి గారు మరియు పాఠశాల ఉపాధ్యాయులు కోటి. రత్నం, యేసు రత్నం, ఖాదర్ భాష , పద్మజ రాణి గారు, తర్వాత స్పెషల్ ఎడ్యుకేటర్ తిరుపతమ్మ గారు మరియు భవిత సెంటర్ ఉపాధ్యాయులు ఎస్.సైమన్ గారు,కే. గోపాల్ కృష్ణ గారు మరియు ఫిజియోథెరపీ డాక్టర్ జి.పుల్లయ్య గారు , ఆయా హబీబా గారు మరియు పిల్లలు వారి తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు

## డయాలసిస్ సెంటర్ ఏర్పాటు కోసం వైద్యారోగ్య మంత్రికి వినతి

**మక్తల్, ఆత్మకూరులలో ఏర్పాటు చేయాలని కోరిన ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి**



అమరచింత వనపర్తి డిసెంబర్ 16 జనం రిపోర్టర్: మక్తల్ నియోజకవర్గ కేంద్రంతో పాటు ఆత్మకూరులోనూ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి సోమవారం వినతిపత్రం అందించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కార్యాలయంలో దామోదర్ రాజనర్సింహను కలిసి మక్తల్ నియోజవర్గంలో డయాలసిస్ సెంటర్ లేకపోవడంతో నియోజకవర్గ ప్రజలు సుమారు 100కు పైగా కిలోమీటర్లు ప్రయాణించి డయాలసిస్ సేవలు పొందాల్సి వస్తుందని, ఇది డయాలసిస్ రోగులకు చాలా ఇబ్బందిగా మారిందని తెలియజేశారు. వెంటనే మక్తల్ ఆత్మకూరులలో డయాలసిస్ సెంటర్లను ప్రారంభించి, డయాలసిస్ రోగులకు ఉపశమనం కలిగించాలని విన్నవించారు. స్పందించిన వైద్యాలకు శాఖ మంత్రి... వెంటనే అధికారులను పిలిపించే మక్తల్ నియోజకవర్గంలో డయాలసిస్ సెంటర్ల ఏర్పాటు కోసం కావాల్సిన చర్యలను త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా డయాలసిస్ సెంటర్లు ప్రారంభిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ధన్యవాదాలు తెలిపారు.

## ఆర్డీవో కార్యాలయ గ్రీవెన్స్ కు 7 ఫిర్యాదులు నమోదు



రేపల్లె డిసెంబర్ 16 జనం రిపోర్టర్: స్థానిక రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం, రేపల్లె నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించడం జరిగినది .సదరు కార్యక్రమమునకు వచ్చిన ఫిర్యాదు వివరములను ఆర్డీవో రామలక్ష్మితెలియ జేస్తూ 1. చుండూరు మండలం ఎడ్లపాడు గ్రామ కాపరస్తులైన లింగినేని కృష్ణమూర్తి అనువారు ఎడ్లపల్లి గ్రామం నందు గల తన భూమిని ఆన్లైన్ చేయవలసిందిగా కోరుతూ ఒక అర్జీ 2. భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామకాపరస్తులైన ముమ్మలనేని యామిని అనువారు తనకు ఓలేరు గ్రామంలో గల భూమిని వేరొకరు ఆక్రమించి ఉన్నారని సదరు వారి మీద చర్యలు తీసుకొని వారి భూమిని వారికి ఇప్పించవలసిందిగా కోరుతూ ఒక అర్జీ 3. రేపల్లె మున్సిపాలిటీ నుంచి ఓడుగు రాంబాబు అను వారు నిజాంపట్నం మండలం అడవులదీవి గ్రామంలో తనకు గల సర్వే నెంబరు 377/4 నందు 91 సెంట్లు భూమి కలగని సదరు భూమి నందు 71 సెంట్లు మాత్రమే ఆన్లైన్ కాబడినదని మిగిలిన 20 సెంట్లు ఆన్లైన్ చేయవలసిందిగా కోరుతూ ఒక అర్జీ 4. రేపల్లె మున్సిపాలిటీ నుండి అద్దేపల్లి సాయికుమార్ మరియు ఇతరులు రేపల్లె రోడ్డు విస్తరణలో భాగంగా తమ భూములు తీసుకొనుట జరిగినదని సదరు భూములకు సంబంధించి నష్టపరిహారము ఇప్పటివరకు అందజేయబడలేదని కావున సదరు భూములకు నష్టపరిహారం ఇప్పించవలసిందిగా కోరుతూ ఒక అర్జీ 5. రేపల్లె మండలం పెనుమూడి గ్రామ ప్రజలు పెనుమూడి గ్రామంలోనికి వెళ్ళు వంతెన బలహీనముగా ఉన్నదని కావున సదరవంతెనను మరమ్మత్తులుచేయించవలసినదిగాను మరియు సదరవంతనపై భారీ వాహనముల ను నిలుపుదల చేయవలసినదిగా కోరుతూ ఒక అర్జీ 6. గొరిగిపూడి విద్యా ప్రసాద్ అనువారు అమర్తలూరు మండలం ప్యాపర్రు గ్రామం నందు అనర్హులైన డప్పు కళాకారుల కు పెన్షన్లు మంజూరు కాబడినవని వాటిని విచారణ జరపవలసినదిగా కోరుతూ ఒక అర్జీ 7. రేపల్లె మున్సిపాలిటీ నుండి దామర్ల శ్రీనివాసరావు అను వారు శ్రీయుత ఏపీ డీజీపీ కి తేదీ 04 . 11 .2024. న అర్జీ ఇవ్వటం జరిగినదని విచారణ చేయవలసినదిగా కోరుతూ ఒక అర్జీమొత్తం ఏడు అర్జీలు వచ్చినవి అని తెలియజేశారు ఈ అర్జీలను సంబంధిత శాఖలకు పంపించి త్వరగా తిన పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలియజేశారు

## నేడు ధనుర్మాసం రెండవరోజు2వ పాశురము

రేపల్లె డిసెంబర్ 16 జనం రిపోర్టర్: 2 వ పాశురము యొక్క విశిష్ట తను అర్చక స్వాములు చక్రి మాట్లాడుతూ వైయత్తు వాళ్ వీర్ గళ్! నాముమ్ నమ్మావైక్కు

**శేయ్యుం కిరిశైగళ్ కేళీరో, పాఱ్కడలుళ్**
**పైయ త్తుయిన్ష పరమనడిపాడి**
**నెయ్యుణ్ణోమ్ పాలుణ్ణోమ్ నాట్కాలే నీరాడి**
**మైయిట్టెళుదోమ్ మలరిట్టు నామ్ ముడియోమ్**
**శెయ్యాదన శెయ్యోమ్ తీక్కుఱళైచ్చెన్ఱోదోమ్**
**ఐయముమ్ పిచ్చైయుంఆన్దనై యుంకైకాట్టి**
**ఉయ్యుమాఱెణ్ణి యుగన్దేలో రెమ్బావాయ్.**

ఈ శ్లోకం భావము తెలియజేస్తూ భూలోకంలోని గోకులంలో పుట్టిన భాగ్యవతులారా! మనం చేయబోయే వ్రతానికి ముఖ్యంగా ఆచరించవలసిన కృత్యముల వినుడు. శ్రీ మన్నారాయణుని పాదారవిందాలకు కీర్తిస్తాము. అతనితో కల్గిన విశ్లేష సమయాన ఇతరములైన ఎట్టి భోగ్య విషయాలను తలచము. పాలను త్రాగము. కన్నుల కాటుక నుంచము. నేతిని భుజింపము. సిగలో పూలను దాల్చము. అనగా శాస్త్ర విరుద్ధములైన ఎట్టి పనులను చేయము. ఒకరిపై చాడీలను చెప్పము. సత్పాత్రదానము చేతము. సన్యాసులకును, బ్రహ్మచారులకును సత్పత్రదానము చేతుము. ఇంకను ఉజ్జీవించు మార్గములేవైన యున్న వాని నెరిగి సంతోషముతో నాచరింతుము. ఇట్లు యీ ధనుర్మాస కాలమంతయు కొనసాగింతుము. ఇదియే మన వ్రతము.అని భక్తులకు తెలియజేస్తున్నారు.భక్తులు శ్రీ లక్ష్మీ గొదా సామెత వెంకటేశ్వరస్వామి దేవాలయం వదకువచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల లో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కాగలరు కోరుతున్నామన్నారు.

## అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన పాతర్ చెడ్



అమరచింత (నర్వ) నారాయణపేట డిసెంబర్ 16 జనం రిపోర్టర్: నర్వ మండలంలోని పాతర్ చెడ్ గ్రామంలో అయ్యప్ప మహా పడిపూజను గురుస్వాములు ఘనంగా నిర్వహించారు .అయ్యప్ప నామస్మరణతో పాతర్ చెడ్ గ్రామం మారుమోగింది. సోమవారం పాతర్చేడ్ , గ్రామంలో శ్రీశ్రీశ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవం కన్నుల పండుగగా సాగింది. అయ్యప్ప స్వామికి అభిషేకాలు నిర్వహించారు. బి కే నర్సింహా స్వామి 18 వ పడి పూజ కార్యక్రమలో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి సంకీర్తనతో గురుస్వాములు భక్తులను మంత్రముగ్ధులను చేశారు. ఈ మహా పడిపూజలో ఉండేకోడ్ మాజీ ఎంపీటీసీ వాల్మీకి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల నీరాజ్ నర్వ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు పార్టీ వావిల్ల వెంకటేశ్వర్ రెడ్డి నర్వ మండలం కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ శ్రీనివాస్ చారీ జిల్లా సోషల్ మీడియా కోర్డినేటర్ సి.లక్ష్మణ్ గౌడ్ నియోజకవర్గ మాజీ ప్రధాన కార్యదర్శి రామన్ గౌడ్ , నర్వ మండల యూత్ ఉపాధ్యక్షులు మహేష్ గౌడ్ తదితరులు పూజ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## నేడు విద్యుత్ కు అంతరాయం

రేపల్లె డిసెంబర్ 16 జనం రిపోర్టర్: రేపల్లె పట్టణం మరియు రూరల్ గ్రామాల్లో మంగళవారం విద్యుత్ లైన్ల మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ బాబు తెలియజేశారు సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల17.12.2024 న 132/33%ఎజ% సబ్ స్టేషన్ రేపల్లె నందు మరమ్మత్తుల కారణంగా సమయం ఉదయం 8 గంటల నుండి నుండి 11 గంటల వరకు రేపల్లె పట్టణం మరియు రేపల్లె రూరల్ మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన తెలియజేశారు

## షేక్ సోనియా బర్త్డే సందర్భంగా వృద్ధులకు అన్నసంతర్పణ కార్యక్రమం..



పొన్నూరు డిసెంబర్ 16. జనం రిపోర్టర్: గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణానికి చెందిన షేక్ జాకీర్ హుస్సేన్, కరీమా దంపతుల కుమార్తె షేక్ సోనియా సోమవారం పుట్టినరోజు సందర్భంగా వారి తల్లిదండ్రులు విద్యానగర్ లోని వృద్ధాశ్రమంలో అన్నసంతర్పణ చేశారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసిన సందర్భంగా వృద్ధులు షేక్ సోనియాకు నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆయురారోగ్యాలు అష్ట ఐశ్వర్యాలు ఉండాలని ఆ భగవంతున్ని కోరారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధి పోకల సుధాకర్ పాల్గొన్నారు.

## అమరుడు కామ్రేడ్ రాములన్న స్థూపాన్ని కూల్చి వేయడాన్ని నిరసిస్తూ నిరసనలు...

**కమ్యూనిస్టులపై ఉన్న గుడ్డి ద్వేషాన్ని ప్రదర్శించిన జాయింట్ కలెక్టర్...**

**సిపిఐ ఎం ఎల్ డివిజన్ కార్యదర్శి తోకల రమేష్...**



**రామగుండం /డిసెంబర్ 16(జనం రిపోర్టర్):** సీపీఐ ఎం ఎల్ మాస్ లైన్ ప్రజా పంథా పెద్దపెల్లి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కార్మికోద్యమ నేత, అమరుడు కామ్రేడ్ రాములన్న స్థూపాన్ని కూల్చి వేయడాన్ని నిరసిస్తూ, కూల్చి వేసిన స్థలం సందర్శించి నిరసన తెలపడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా పెద్దపెల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్ మాట్లాడుతూ... రాములన్న స్తూపాన్ని అభివృద్ధికి అడ్డుగా ఉందనే పేరుతో మున్సిపల్ అధికారులు మున్సిపల్ ఆఫీస్ పక్కనగల కామ్రేడ్. యు.రాములు స్థూపాన్ని జాయింట్ కలెక్టర్ గా ఉన్న అరుణ శ్రీ, కమ్యూనిస్టులపై ఉన్న గుడ్డి ద్వేషాన్ని ప్రదర్శించి, కమ్యూనిస్టులు దేవాలయాలుగా భావించే స్థూపాన్ని కూల్చివేయడం అత్యంత దురదృష్టకరం కార్మికులు, ప్రజలు అభిమానంతో నిర్మించుకున్న అమరుడు యు.రాములు స్థూపాన్ని ఈరోజు తెల్లవారుజామున దొంగ చాటుగా కూల్చివేయడం అప్రజాస్వామికం. శాసనసభ్యులు రాజ్ ఠాగూర్ మక్కాన్సింగ్ ఇప్పటికైనా జోక్యం చేసుకొని మరో చోట స్తూపం నిర్మించుకోవడానికి స్థలం కేటాయించాలని కోరుతున్నాం అని, కమ్యూనిస్టుల స్థూపాన్ని కూల్చివేసి అవమానించిన జాయింట్ కలెక్టర్ అరుణ శ్రీ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఫిర్యాదు చేయబోతున్నాం అని, ఇలాంటి చర్యలు కార్మికుల మనోభావాలను దెబ్బతీస్తాయి. కనీసం వినతిపత్రం తీసుకోవడానికి కూడా జాయింట్ కలెక్టర్కు సమయం లేదు. కమ్యూనిస్టుల వాదన వినేందుకు కూడా ఇష్టపడని జాయింట్ కలెక్టర్ చర్యల మూలంగానే స్తూపం కూల్చివేతకు గురి అయింది. దీనికి పూర్తి బాధ్యత జాయింట్ కలెక్టర్ వహించాలని డిమాండ్ చేస్తున్నాం, కమ్యూనిస్టుల మనోభావాలను దెబ్బతీసే విధంగా స్థూపాన్ని కూల్చివేసిన జాయింట్ కలెక్టర్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ ప్రజా పంథా, కరీంనగర్ ఉమ్మడి జిల్లా నాయకులు ఆడెపు శంకర్, గూడూరు వైకుంఠం,గొల్లపల్లి చంద్రయ్య, మార్త రాములు, పెండ్యాల రమేష్, కలువల రాయమల్లు,నాని బాబు, కట్ట తేజేశ్వర్, ఇనుగాల రాజేశ్వర్, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

## రెండవ రోజు గ్రూప్ -2 పరీక్ష కేంద్రాలను పరిశీలించిన సీపీ.....

**జవాబు పత్రాల తరలింపు వరకు పోలీసు బందోబస్తు కొనసాగింపు...**



**రామగుండం /డిసెంబర్ 16(జనం రిపోర్టర్):**రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతున్న గ్రూప్-2 పరీక్షలు కమీషనరేట్ పరిధిలో మెదటి రోజు ఎలాంటి అవాంఛనియా సంఘటనలు లేకుండా జరిగాయి, అదేవిదంగా రెండవ రోజు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కమీషనరేట్ పరిధి లో 66 పరీక్ష కేంద్రాల నందు కొనసాగుతున్నట్లు రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ తెలిపారు. రెండవ రోజు పెద్దపల్లి పట్టణం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, పలు పరీక్ష కేంద్రాలను సీపీ స్వయంగా పరిశీలించి, అధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల లోపల, పరిసర ప్రాంతాల నందు క్షుణ్ణంగా పరిశీలించాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి సెంటర్ వద్ద అభ్యర్థులను ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్ లను లోపలికి తీసుకుపోకుండా క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపించడం జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమల్లో ఉందని తెలిపారు. కమీషనరేట్ పరిధిలో 411 మంది పోలీస్ సిబ్బంది,ఇన్స్పెక్టర్, పై ర్యాంక్ అధికారులు కూడా క్షేత్ర స్థాయిలో పరీక్ష కేంద్రాలను సందర్శించి, పటిష్టమైన బందోబస్త్ పర్యవేక్షణ చేయడం జరుగింది. ఇతర పోలీస్ అధికారులు ప్రతి పరీక్షా కేంద్రం వద్ద, రూట్స్ లలో, పరీక్ష ముందు ప్రశ్న పత్రాలు తీసుకుపోవడం,అనంతరం జవాబు పత్రాలు స్ట్రాంగ్ రూమ్ లకు తరలింపుకు అర్మడ్ సిబ్బంది తో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ చేతన, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, ఎస్ఐ లక్ష్మణ్, తదితరులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరం పై టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆకస్మిక దాడి



**రామగుండం /డిసెంబర్ 16(జనం రిపోర్టర్):** రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం. శ్రీనివాస్ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్సు సీఐ రాజ్ కుమార్ , టాస్క్ ఫోర్స్ ఎస్ఐ, టాస్క్ ఫోర్సు సిబ్బంది కలిసి మంచిర్యాల జిల్లా కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని, చిన్న ధర్మారం శివారు అడవి ప్రాంతంలో, కొంతమంది జూదరులు రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరం పై ఆకస్మిక దాడి నిర్వహించి, పేకాట ఆడుతున్న ఆరుగురు పేకాట రాయుళ్ళని పట్టుకుని వారి వద్ద నుండి 13,220/- రూపాయల నగదు, ఐదు సెల్ ఫోన్లు ని స్వాధీనం చేసుకొని, తదుపరి విచారణ నిమిత్తం కాసీపేట పోలీస్ వారికి అప్పగించడం జరిగింది.

పట్టీబడిన నిందితుల వివరాలు:

1.ఎగ్గె .రాజు కుమార్ వయస్సు

38 వృత్తి కూలి, గ్రామం ముత్యం పల్లి కాసిపేట్, 2.వేల్పుల సతీష్ వయస్సు 38 గ్రామం గొల్లపల్లి టోల్గేట్, ముత్యం పల్లి కాసిపేట్. 3.షేక్ అహ్మద్ వయస్సు 41 వృత్తి కూలి గ్రామం చిన్న ధర్మారం, కాసిపేట్, 4.ఎండి యాకిన్ వయస్సు 48 వృత్తి కూలి, గ్రామం చిన్న ధర్మారం. కాసిపేట్, 5.మారం శంకర్ వయస్సు 35 వృత్తి కూలి. గ్రామం ముత్యం పల్లి కాసిపేట్, 6.సూరం శ్రీనివాస్ వయస్సు 58, వృత్తి రిటైర్డ్ సింగరేణి వర్కర్. గ్రామం చిన్న ధర్మారం. కాసిపేట్.

## అభిమానుల సమక్షంలో వైస్ చైర్మన్ జన్మదిన వేడుకలు

రేపల్లె డిసెంబర్ 16 జనం రిపోర్టర్: స్థానిక ఏ ఈ ఎల్ సీ చర్చి వద్ద మున్సిపల్ వైస్ చైర్మన్ జి ప్రశాంత్ కుమార్ జన్మ దిన వేడుకలు అభిమానుల సమక్షంలో ఘనంగా జరిగాయి .ప్రశాంత్ కుమార్ కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో చైర్మన్ కట్టా మంగా సుబ్బారావు వైస్ చైర్మన్ టికేవీ గుప్త. కృష్ణారెడ్డి .చదలవాడ శ్రీనివాసరావు చిత్రాల ఒబేధు చినట బాలాజి. వై మధన్ మోహన్ . వైసిపి నాయకులు వున్నారు

## ఇంధన పొదుపు అందరి భాద్యత

ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహా రెడ్డి




(కనిగిరి డిసెంబర్ 16 జనంరి పోర్టర్ ): ఇంధన పొదుపు అందరి భాద్యతని స్థానిక శ్యాసన సభ్యులు ముక్కు ఉగ్ర నరసింహరెడ్డి అన్నారు. జాతీయ ఇంధన వారోవాత్సలలో భాగంగా సోమవారం కనిగిరి పట్టణంలో విద్యుత్ అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే ఉగ్రనరసింహరెడ్డి పాల్గొని మాట్లాడుతు ఇంధనం పొదుపు భావితరాలకు మలుపు అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులతోపాటు సిబ్బంది పాల్గొన్నారు

## నవాబుపేట్ మండల కేంద్రంలోని శ్రీ సద్గురు మాణిక్య ప్రభు 84వ వార్షికోత్సవాలకు హాజరైన చేవెళ్ల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి పట్లోళ్ల కార్తిక్ రెడ్డి..!!

### నవాబుపేట్ బి ఆర్ఎస్ పార్టీమండల అధ్యక్షుడు అంతన్నోళ్ళ దయాకర్ రెడ్డి..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవాబుపేట్ డిసెంబర్ 16 (జనం రిపోర్టర్): నవాబుపేట్ మండల కేంద్రంలోని శ్రీ సద్గురు మాణిక్య ప్రభు స్వాములవారి మొక్కులు తీర్చుకొనుటకు చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జి పట్లోల కార్తీక్ రెడ్డి నవాబుపేట్ మండల కేంద్రంలో మాణిక్ రావు స్వామి వారికి 84వ వార్షికోత్సవ సందర్భంగా ప్రతేక పూజ కార్యక్రమం చెయడం జరిగింది, బి ఆర్ ఎస్ పార్టీ నూతన కార్యాలయానికి చెరుకొని బి ఆర్ ఎస్ పార్టీ జెండాను ఎగారావేసి నూతన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగింది. మరియు నూతనంగా పార్టీలో చేరినవారికి బి ఆర్ ఎస్ కండువా కపి పార్టీలోకి హావ్వనించడం జరిగింది అనంతరం పార్టీ శ్రేణులతో మాట్లాడుతూ మా నూతన బి ఆర్ఎస్పార్టీ మండల్ నాయకత్వ బృందానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపు నవాబుపేట్ మండల్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకత్వ బృందంతో పార్టీ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందానారు ఈ కార్యక్రమంలో నవాబుపేట్ మండల్ బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు పట్లోల్ల భారత్ రెడ్డి , బి ఆర్ ఎస్ పార్టీ కార్మిక విభాగం స్టేట్ సెక్రెటర్ విజయ్,ముఖ్య సలహాదారులు సయ్యద్ గౌస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గణపురం శాంతి కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షులు వడ్ల పురుషోత్తం చారి, ప్రధాన కార్యదర్శి పోలీస్ మహేష్ రెడ్డి,



ఉపాధ్యక్షులు దాస్ గౌడ్, కార్యదర్శి పి.మహేష్, కార్యదర్శి ఎన్ విష్ణు కుమార్, కార్యదర్శి అమరేందర్ రెడ్డి,కార్యనిర్వాక కార్యదర్శి బి. మాణిక్ రెడ్డి, కార్య వర్గ సభ్యులు విఠల్ రెడ్డి , రామ్ లక్ష్మణ్, మహేష్ ఎస్ సి సెల్ అధ్యక్షుడు కావాలి రాజు, ఎస్ సి సెల్ ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, బి సి సెల్ అధ్యక్షులు కే. శ్రీకాంత్ గౌడ్, యువజన విభాగం అధ్యక్షులు సంతోష్ రెడ్డి, యూవజన విభాగం కార్యదర్శి ఎస్. గోవర్ధన్ , సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి :కే కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ వినోద్, విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, బి ఆర్ఎస్ పార్టీ నాయకులుకార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు అండగా అఖండ ఫౌండేషన్ రూ.10 వేల ఆర్థిక సాయం ...

### అధ్యక్షులు విన్నకోట సురేష్...

### రూ.4 వేలు అందించిన విద్యుత్ ఏఈ...



/డిసెంబర్ 16(జనం రిపోర్టర్): అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు అఖండ ఫౌండేషన్ అండగా నిలిచింది. కొండంత కష్టంలో నిలిచిన వారికి తోడుగా ఉంటామంటూ ముందుకు వచ్చింది. బాపట్ల ఉప్పరపాలెం ఆరో వార్డులో ఈ నెల 6న విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాద సమయంలో బాపట్ల మున్సిపల్ హై స్కూల్ గ్రౌండ్స్ లో సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన ఉండటంతో ఆ కార్యక్రమానికి తన కూతురి తోపాటు తల్లిదండ్రులు కూడా హాజరయ్యారు. ఈ సమయంలో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఏమినేని శ్రీనివాసరావు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల పూరి ఇల్లు పూర్తిగా దగ్ధమవడంతోపాటు ఇంటిలోని సామగ్రి, అలాగే పదవ తరగతి చదువుతున్న కుమారుడు సర్టిఫికెట్లు పూర్తిగా కాలిపోయాయి. అలాగే ఇంట్లో ఉన్న సామాన్లు ఇండియన్ గ్యాస్ సిలిండర్లు కూడా అగ్నికి పేలిపోయాయి, దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. ఆ కుటుంబానికి కొండంత ఆసరాగా నిలబడి సోమవారం అఖండ పౌండేషన్ సభ్యులు బాధిత కుటుంబం వద్దకు వెళ్లి 10 వేల రూపాయల ఆర్థిక సాయం అలాగే దుప్పట్లను అందించారు. వీరితోపాటు బాపట్ల పట్టణ విద్యుత్ ఏఈ సాయి శ్రీనివాసరావు రూ.4 వేలు బాధితత కుటుంబానికి అందించి తమ ఉదారత చాటుకున్నారు. ఈ సందర్భంగా అఖండ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు జివిఎల్ మోహన్ గౌడ్ మాట్లాడుతూబీ ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారికి తగిన న్యాయం చేస్తానని తెలిపారు.. ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ మాట్లాడుతూ ఈ ప్రమాదం చాలా బాధాకరం, ఇటువంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రతి ఒక్కరు చెయ్యి చెయ్యి కలుపుకొని ముందుకు వెళ్లి సాయం చేయాలని అన్నారు. మేము చేసిన సాయం చిన్నదే కావచ్చు శ్రీరాముడు కి ఉడత సాయం ఎలాగో వారికి కూడా కష్టకాలంలో ఉన్నవారికి కొండంత ధైర్యంగా ఉంటుందని ఫౌండేషన్ తరపున 10, వేలు ఆర్థిక సాయం చేయడం అలాగే విద్యుత్ శాఖ పట్టణ ఏఇ సాయి శ్రీనివాస్ స్పందించి 4000 ఆర్థిక సాయం చేయడం చాలా గొప్ప విషయమని అలాగే దాతలు ముందుకు వచ్చి వారికి సాయం చేయాలని ఆయన అన్నారు... ఈ కార్యక్రమంలో అఖండ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వంగపాటి శివ, ఫౌండేషన్ సభ్యులు చేజర్ల సతీష్, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు...

## వికారాబాద్ జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్ పి నారాయణ రెడ్డి సందర్శించారు..!!




వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 16 (జనం రిపోర్టర్): వికారాబాద్ మున్సిపల్ పట్టణం లో సోమవారం గర్ల్స్ హై స్కూల్, నాగార్జున హై స్కూల్, సిధార్థ హై స్కూల్, బాస్యం,సంగం లక్ష్మి బాయి స్కూల్,శ్రీ చైతన్య స్కూల్, సాయి డెంటల్ కళాశాల, బృంగి ఇంటర్నేషనల్ స్కూల్ లలో - జరుగుతున్న పరీక్ష-2 కేంద్రాలను కలెక్టర్ మరియు జిల్లా ఎస్.పి తో కలిసి పరిశీలించారు. పరీక్ష నిర్వహణ గదులను, వైద్య, ఇతర సౌకర్యాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అభ్యర్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రం లో మౌలిక సదుపాయాలతో పాటు వైద్య సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. వికారాబాద్ నుండి తాండూర్ మండల కేంద్రంలోని గ్రూప్ 2 పరీక్షల భాష్యం జూనియర్ మరియు సెంట్ మార్ఫ్స్ కళాశాలలు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు. గ్రూప్ 2 పరీక్షల నిర్వహణలో భాగంగా రెండవ రోజు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తాండూర్ మండల కేంద్రంలోని భాష్యం జూనియర్ కళాశాల, సెంట్ మార్ఫ్స్ ఉన్నత పాఠశాల, సెంట్ మార్ఫ్స్ జూబిలీ పాఠశాలలోని పరీక్ష కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల్లోని మౌలిక సదుపాయాలతో పాటు వైద్య సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. పరీక్షకు హాజరు అయ్యే అభ్యర్థులను పరీక్ష కేంద్రాలకు అనుమతించే క్రమంలో అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు.



### ఆర్ జి -3 ఏరియా ఓసిపి-1 సి.హెచ్.పి లో

## ఘనంగా భద్రత వారోత్సవాలు.....



రామగుండం /డిసెంబర్ 16(జనం రిపోర్టర్): సింగరేణి సంస్థ నిర్వహిస్తున్న 55వ. భద్రత పక్షోత్సవాలలో భాగంగా సోమవారం ఆర్ జి -3 ఏరియా ఓసిపి-1 సి.హెచ్.పి లో ఘనంగా భద్రత వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించగా, డి. వి.ఎస్.సూర్యనారాయణ రాజు (జి.యం,ఓసీపీస్) కన్వీనర్ గా ఉన్న కమిటీ సి.హెచ్.పి లో పర్యటించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఈ %=+%.3 ఏరియా ఓసిపి-1 సి.హెచ్. పి కి ఒక చరిత్ర ఉందని, ఈ సి.హెచ్. పి ఎన్నో రికార్డులు సృష్టించిందని, గత సంవత్సరం ఈ ఓసిపి-1 సి.హెచ్.పి రక్షణ వారోత్సవాలలో మొదటి స్థానంలో నిలిచిందని, దానికి ప్రతి కార్మికుడు, అధికారి,సూపర్ వైజర్ కృషే కారణమని అన్నారు.అలాగే ప్రతి కార్మికుడు “నా భద్రత- నా బాధ్యత” అనే భావనతో పనిచేస్తే ప్రమాదాలను నివారించి, ప్రమాద రహిత సి.హెచ్.పి గా నిలపవచ్చునని అన్నారు.ఈ సందర్భంగా కన్వేయర్ ఆపరేటర్ కొండ్ర రాధాకృష్ణ నేతృత్వంలోని కళాకారులు, రిటైర్ కార్మికుడు చంద్రపాల్, వాసాల రమేశ్, జగదీష్, రవీందర్ లు ప్రదర్శించిన నాటిక “నా భద్రత - నా బాధ్యత” పలువురిని ఆలోచింపచేసింది. అనంతరం రక్షణ కమిటీ సభ్యులు, ఓ.సి.పి.1 అధికారులు,కార్మికులు కళాకారులకు అభినందనలు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఓసిపి-1 ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజశేఖర్, ఏరియా ఇంజినీర్ శేఖర్ బాబు, సి.హెచ్.పి ఉన్నతాధికారి కాశీ విష్వేశ్వరరావు, మేనేజర్ ఉదయ్ హరిజన్ తో పాటు పలువురు అధికారులు, కార్మికసంఘాల నాయకులు,సూపర్వైజర్లు,కార్మికులు పాల్గొన్నారు.

# జాతీయ అవార్డు తో మరింత సామాజిక బాధ్యత పెరిగింది.....

### ఏ రంగంలో ఉన్న నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతునే ఉంటా....

### మద్దెల దినేష్..



రామగుండం /డిసెంబర్ 16(జనం రిపోర్టర్): డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ జాతీయ అవార్డు స్వీకరించడం వల్ల చాలా సంతోషంగా ఉందని, ఈ అవార్డుతో మరింత సామాజిక బాధ్యత నాపై పెరిగిందని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్, ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ పేర్కొన్నారు. డిసెంబర్ 15న. దేశ రాజధాని ఢిల్లీలో ఆంధ్ర అసోసియేషన్ ఆడిటోరియంలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ 17వ. నేషనల్ కాన్ఫరెన్స్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు ను నా సేవలను గుర్తించి, (బిఎస్ఏ) నిర్వాహకులు నల్ల రాధ కృష్ణ అందజేశారని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా విశిష్ట అతిథిగా విచ్చేసిన కాన్షిరాం సోదరి స్వర్ణకౌర్ ని మర్యాద పూర్వకంగా కలవడం జరిగిందన్నారు. ఇట్టి అవార్డు దేశ రాజ్యాంగ నిర్మాత అయిన మహనీయులు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ పేరుతో నిర్వాహకులు నాకు ఇవ్వడం వల్ల నేను ఎంతో గర్వపడుతున్నానని ఆయన పేర్కొన్నారు. దేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన సామాజిక సేవకులను, వారు చేసిన సేవలను గుర్తించి, బి.ఎస్.ఎ జాతీయ నిర్వాహకులు ఇట్టి అవార్డు ను అందజేశారని, అందులో తెలంగాణ నుంచి నేను ఈ అవార్డుకు ఎంపిక ఐనానని ఆయన అన్నారు. ముఖ్యంగా పెద్దపల్లి జిల్లా,రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న వివిధ ప్రజల సమస్యల పై పరిష్కారం కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు చేయడం జరిగిందని, ఎన్నో రకాల సమస్యలను పరిష్కారం చేయడం జరిగిందని ఆయన అన్నారు. ముఖ్యంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో విద్యా, వైద్యం, ఉపాధి హక్కుల కోసం వివిధ నిమ్న వర్గాలకు చెందిన సామాజిక, ఆర్థిక సమస్యలను సంభందిత అధికారులతో పాటు ప్రభుత్వ పెద్దలతో చట్ట బద్ధంగా, న్యాయంగా ముందుకు వెళుతూ మాట్లాడి పరిష్కారం చూపెట్టడం జరిగిందని వారన్నారు. అదేవిధంగా నిరుపేద కుటుంబాలకు, నిరాశ్రయులైన వృద్ధులతంతకు, వికలాంగులకు, అన్నార్తుల కు, సామాజిక బాధ్యత తో ప్రభుత్వ పథకాలను పొందే విధంగా సహాయం చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. అదేవిధంగా ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ ద్వారా ఎంతోమంది నిరాశ్రయులైన విద్యార్థులకు వారి అభివృద్ధి కోసం, ఉన్నత విద్య కోసం ఎన్నో రకాలుగా, సహాయ సహకారాలు నిరంతరం అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. గత ఇరవై మూడు సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో సిపిఐ అనుబంధ ప్రజా సంఘాలైన ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ తో పాటు డి.హెచ్.పి.ఎస్ మరియు ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ను ఏర్పాటు చేసి, ప్రజలకు చెందిన అనేక రకాల సమస్యలపై పరిష్కారం కోసం పోరాటాలు, ఉద్యమాలు చేయడం జరిగిందన్నారు. జాతీయ బి.ఎస్.ఎ సంస్థ నా సేవలను గుర్తించి మహోత్తార మేధావి అయిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ పేరు పై జాతీయ అవార్డు స్వీకరించడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ అవార్డుతో ప్రజలకు సామాజిక పరంగా నాకు మరింత బాధ్యత పెరిగిందని ఆయన అన్నారు. నాకు అందజేసిన బిఎస్ఎ జాతీయ అధ్యక్షులు నల్ల రాధ కృష్ణ, నిర్వాహకులకు బాదే వెంకటేష్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఇట్టి అవార్డు నాకు రావడానికి సహకరించిన రామగుండం నియోజకవర్గ ప్రజలకు ముఖ్యంగా ప్రెస్ సోదరులు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా మిత్రులందరికి పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు.

## పరిష్కార వేదికల్లో నాలుగు ఫిర్యాదులు.



మొగల్తూరు, డిసెంబరు16జనం రిపోర్టర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నాలుగు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ తెలిపారు. శేరేపాలెం గ్రామానికి చెందిన కత్తుల కృష్ణా రావు తన ఇంటి వద్ద నుండి పోలానికి వెళ్ళే దారి మూసివేయడంతో ఇబ్బందులు పడుతున్నామని సమస్యను పరి ష్కరించాలని ఫిర్యాదు అందించాడు. అలాగే ఇద్దరు వేర్వేరు ఫిర్యాదులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో త్రిశూల పాణి, ఏవో అబ్దుల్ రహీమ్, డిటి సంధ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన వైసీపీ నేత అంబటి



పొన్నూరు డిసెంబర్ 16. జనం రిపోర్టర్: గుంటూరు జిల్లా పొన్నూరు వైఎస్ఆర్సిపి సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ సోమవారం నియోజకవర్గ పరిధిలోని అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన సూరిశెట్టి ధనలక్ష్మి అనారోగ్యంతో మంగళగిరి ఎన్ఆర్ఐ హాస్పిటల్లో చికిత్స పొందుతుండగా ఆయన వైద్యశాలకు వెళ్లి పరామర్శించారు., పెదకాకాని మండలం ఉప్పలపాడు పక్షుల కేంద్రం మాజీ చైర్మన్ అనిల్ కుమార్ తండ్రి బ్రెయిన్ స్ట్రోక్ తో ఇటీవల గుంటూరు జనరల్ హాస్పిటల్ చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని వైద్యశాలకు వెళ్లి ఆయన్ని పరామర్శించారు. ఇటీవల మునిపల్లె గ్రామానికి చెందిన వైఎస్ఆర్ పార్టీ నాయకుడు గుంటుపల్లి అంజయ్య ప్రత్యర్థుల చేతిలో గాయపడి చికిత్స పొందుతున్న నేపథ్యంలో మునిపల్లె ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలతో పాటు నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడు వైయస్సార్ పార్టీ అండగా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆయన వెంట ఆయా గ్రామాల వైఎస్ఆర్సిపి శ్రేణులు పాల్గొన్నారు.

## జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు



(కాకుమాను డిసెంబర్ 16 జనం రిపోర్టర్): జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు 2024 , డిసెంబర్ 14 నుండి 20వ తేదీ వరకు నిర్వహించబడుతున్న సందర్భంగా విద్యుత్ శాఖ వారిచే స్థానిక నన్నపనేని వారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు , “ఇంధన పొదుపు ఆవశ్యకత “అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి కె ఎఫ్. కెన్నెడీ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ పొన్నూరు ఏడిఈ శ్రీ జి శ్యామ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు .కెఎఫ్ కెనడి విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. విద్యుత్ శాఖ ఏడిఈ శ్యాం కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే విద్యుత్ పొదుపు పై ,పొదుపు విధానాలపై అవగాహన ఏర్పరచుకోవాలని సూచించారు. వివిధ పొదుపు మార్గాలను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి. సత్యం మరియు కాకుమాను విద్యుత్ శాఖా సిబ్బంది పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నేడు మిరియాల శిరీష విజయభాస్కర్ శంకుస్థాపనలు



రాజవొమ్మంగి,రంపచోడవరం డిసెంబర్:16 జనం రిపోర్టర్: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా విజయభాస్కర్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం శంకుస్థాపనలు చేయనున్నారు వాటి వివరాలు ఇలా ఉన్నాయి మారేడుమిల్లి మండలంలో మారేడుమిల్లి నుండి పూజారిపాకలు మీదుగా వేటుకూరు రోడ్డు, రంపచోడవరం మండలంలో కాకవాడ గండి పైన గల ఆకూరు నుంచి బడిగుంట రోడ్డు (దేవీ పట్నం మండలం),గంగవరం మండలంలోని మోహనాపురం నుంచి శరభవరం రోడ్డు,అడ్డతీగల మండలం గాంధీ బొమ్మ సెంటర్ నుంచి డి భీమవరం మీదుగా రాజవొమ్మంగి మండలం అనంతగిరి రోడ్డుకు శంకుస్థాపనలు చేయనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం సిబ్బంది తెలిపారు ఈ కార్యక్రమాలకు మీడియా మిత్రులు,ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు,అభిమానులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు



## నూతన వ్యాపారాన్ని ప్రారంభించిన అర్బన్ సీఐ

పొన్నూరు డిసెంబర్ 16. జనం రిపోర్టర్: గుంటూరు జిల్లా పొన్నూరు జి బి సి రోడ్డు సబ్ రిజిస్టర్ కార్యాలయం ఎదుట ఎదురు సోమవారం అర్బన్ సీఐ. కిరణ్ కుమార్ నూతన వ్యాపారాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు నాణ్యత అందించి పలువురు మన్నలను పొందాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్సై హరిబాబు తో పాటు వ్యాపార సంస్థ నిర్వాహకులు సమీర్ పాల్గొన్నారు.

## దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తవ్వా వెంకట మహీధర్ రెడ్డి గారి పుట్టినరోజు వేడుకలు



డిసెంబర్ 16 పొదిలి జనం రిపోర్టర్: పొన్నలూరు మండలం మాలపాడు వాస్తవ్యులు తవ్వా వెంకట మహీధర్ రెడ్డి గారి పుట్టినరోజు ఈ పుట్టినరోజు సందర్భంగా నిరుపేదలకు మంచి భోజనాన్ని అందించాలన్న మంచి ఉద్దేశంతో పుట్టినరోజు వేడుకలను దివ్యాంగ్ రక్షక్ పౌండేషన్ వారు గతంలో పుట్టినరోజు మరియు పెళ్లిరోజు వేడుకలను నిరుపేదల మధ్యలో చేస్తున్నారన్న ఒక ప్రకటన చూసి ఫౌండేషన్ నిర్వాహకులకు ఈ బాధ్యత అప్పగించడం జరిగింది ఫౌండేషన్ నిర్వాహకులు నిరుపేదలు మరియు చిన్నపిల్లల మధ్యలో కేక్ కట్ చేసి స్వీటు హాటు అందజేసి తదుపరి 50 మందికి మంచి భోజనం అందించడం జరిగింది దీని సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ నిరుపేదవానికి కడుపు నిండితే మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తారు ఈ ఆశీర్వాదం నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఉండడానికి కచ్చితంగా తోడ్పడుతుంది కనుక పుట్టినరోజు పెళ్లిరోజు సందర్భంగా ఒక్క పేదవానికైనా కడుపునిండా భోజనం పెట్టాలని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో నరసింహారావు, రాధ బ్రహ్మారెడ్డి, ఆంజనేయులు, గౌసియా, రంగ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## 16 విటియం 5 రాష్ట్రస్థాయి ప్రాజెక్టు ఎక్స్పోకు ఎంపికైన విద్యార్థులు



వేటపాలెం డిసెంబర్ 16 ( జనం రిపోర్టర్ ) స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ చెందిన పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రాజెక్ట్ ఎక్స్పో పాలిటెక్నిక్ పెస్ట్ కు ఎంపికైనట్లు కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు కరస్పాండెంట్స్ లక్ష్మణరావు తెలిపారు ఇటీవల ఒంగోలు లో డిఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన రీజనల్ పాలిటెక్నిక్ ఫస్ట్ లో కళాశాలలోని పాలిటెక్నిక్ విద్యార్థులు రూపొందించిన ఆటోమేటిక్ స్టేర్ కేస్ లైట్ కంట్రోల్ యూజింగ్ ఆర్డీవో ప్రాజెక్ట్ కు మొదటి బహుమతి వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే జగదీష్ బాబు తెలిపారు ఈ కార్యక్రమంలో 11 ప్రైవేట్ కళాశాలలో పాల్గొని 56 ప్రాజెక్టులు ప్రదర్శించారని కళాశాల నుండి 11 ప్రాజెక్టులు ప్రదర్శించగా అందులో ఈ ప్రాజెక్టుకు మొదటి స్థానం సాధించగా బహుమతి కింద 25 వేల నగదు లభించినట్లు ఆయన తెలిపారు ఈ ప్రాజెక్టుకు పాలిటెక్నిక్ రెండో సంవత్సరం చదువుతున్న ఈసీఈ బ్రాంచ్ విద్యార్థులు వికాస్, చంద్ర మణికంఠ వై గౌరీ శివ సాయి ప్రసాద్ ఎస్ లోకేష్ లు కళాశాల అధ్యాపకులు సిహెచ్ భాను శ్రీ పర్యవేక్షణలో రూపొందించాలని పాలిటెక్నిక్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె విజయభాస్కర్ రెడ్డి తెలిపారు పంట ఫోటో జనవరి 2025 6 7 8 తేదీల్లో విజయవాడలో జరుగుబోవు స్టేట్ పాలిటెక్నిక్ టెస్ట్ లో ఈ ప్రాజెక్టును ప్రదర్శించనున్నట్లు తెలిపారు ఈ ప్రాజెక్టు తో పాటు వివిధ రకాల 5 ప్రాజెక్టులు ప్రదర్శనకు ఎంపికైనట్లు వారు తెలిపారు.

## శివాలయాల్లో ప్రత్యేక పూజలు అభిషేకాలు



రాజవొమ్మంగి,డిసెంబర్ 16 జనం రిపోర్టర్: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండల కేంద్రంలో స్థానిక శివాలయం కొండ పై కొలువై ఉన్న శ్రీ రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆలయ అర్చకులు కృష్ణ శర్మ మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం సోమవారం రావడంతో స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు ఈకార్యక్రమంలో స్థానిక భక్తులు పాల్గొన్నారు అలాగే స్థానిక సాయి బాబా ఆలయం వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో కొలువై ఉన్న శివలింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# 'జమిలి'కి ఎన్నో చిక్కులు, సవాళ్లు

## (విశ్లేషణ)

జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులకు కేంద్ర కేబినెట్ గురువారం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించే బిల్లులనే ప్రభుత్వం తీసుకొస్తున్నట్టు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికలపై తరువాత నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సుల ప్రకారం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలనూ నిర్వహించాల్సి ఉంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల విషయం ప్రస్తుతానికి పక్కనపెట్టి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలపై తీసుకొచ్చిన బిల్లులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనికి 50 శాతం రాష్ట్రాల ఆమోదం తెలపవలసిన అవసరం లేదని చెబుతున్నారు.స్థానిక సంస్థల ఎన్నికలను కూడా ఒకేసారి నిర్వహించాలంటే రాజ్యాంగ సవరణతోపాటు 50 శాతం రాష్ట్రాలు ఆమోదించవలసి వస్తుంది. ఈ జమిలి ఎన్నికలకు దేశంలో 32 పార్టీలు అనుకూలంగా ఉన్నాయి. 15 పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. దీని వల్ల స్థానిక, ప్రాంతీయ అంశాలు పక్కకు పోయి జాతీయ అంశాలదే పైచేయి అవుతుందని ప్రాంతీయ పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వన్ నేషన్, వన్ ఎలక్షన్ ప్రక్రియ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఎవరెంత మొత్తుకున్నా ప్రధాని మోడీ పట్టించుకోలేదు. జమిలి ఎన్నికల ఆలోచన వెనుక ఆంతర్యం ఏమిటి? అని ప్రశ్నించుకుంటే 2015నాటి ఓ సర్వే ప్రకారం ఏకకాలంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరిగితే 77 శాతం ఓటర్లు రెండింటా ఒకే పార్టీకి ఓటు వేస్తారని తేలింది. దీన్ని దృష్టిలో ఉంచుకునే బిజెపి నేతలు జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకువస్తున్నారని ఒక అంచనా. దేశమంతటా డబుల్ ఇంజన్ సర్కారుకై తహతహలాడుతున్న బిజెపి ఓటర్ల తాలూకు ఈ ఏకకాలపు ఎన్నికల మనస్తత్వం కలిసొస్తుందని బిజెపి ఆశపడుతోంది. నిజానికి ఏకకాలంలో ఎన్నికలు అనేవి మన దేశానికి కొత్తేమీ కావు. 195152లో మొదటి జనరల్ ఎలక్షన్ల నుంచి లోక్‌సభ , రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరుగుతుండేవి. అయితే కాలవ్యవధి పూర్తికాకుండానే రాష్ట్ర అసెంబ్లీలు రద్దవడం ఎప్పుడైతే మొదలైందో, అప్పుడు 1967 తర్వాత నుంచి ఎన్నికల కథ మారిపోయింది. 2020 నవంబర్ 26 న జరిగిన అఖిల భారత సభాధ్యక్షుల సమావేశంలోనూ ప్రధాని మోడీ జమిలి ఎన్నికల అమలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. లోక్‌సభకు, విధాన సభకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు జరిగితే ప్రభుత్వానికి ఆర్థిక భారం చాలా వరకు తగ్గుతుందని, ఎన్నికల ఆంక్షలు పదేపదే అడ్డుతగలకుండా అభివృద్ధి పథకాలను సజావుగా అమలు చేయడానికి వీలవుతుందని అభిప్రాయం వెలిబుచ్చారు. ఎన్నికల నియమావళి అమలుతో ప్రభుత్వ పథకాలు నిలిచిపోతాయన్నది వాస్తవమే అయినా ఈ సమస్యను పరిష్కరించడానికి జమిలి ఎన్నికలే శరణ్యం అనుకోవడం సమంజసం కాదని రాజ్యాంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల బట్టి శాసనసభల్లో అధికార పక్షాలు అధికారంలో ఉండే అవకాశాలు తక్కువగా ఉంటున్నాయి. శాసనసభ్యుల ఫిరాయింపుల వల్ల అవి మెజారిటీ కోల్పోయి, కూలిపోయే అవకాశాలే ఎక్కువగా తటస్థపడుతున్నాయి. ఏ ఒక్కపార్టీ తగిన మెజారిటీతో ప్రభుత్వాన్ని నెలకొల్పే అవకాశం లేనప్పుడు కొద్ది కాలం రాష్ట్రపతి పాలన విధించినా, ఆ తర్వాత ఎన్నికలు నిర్వహించడం తప్పనిసరి అవుతుంది. అంతేకాదు ఒక్కో రాష్ట్ర అసెంబ్లీ పదవీకాలం ఒక్కోసారి ముగింపుకి చేరుకుంటుంది. అలాంటప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగేవరకు ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించి కొనసాగించడం ప్రజాస్వామిక ప్రక్రియకు తీవ్ర విఘాతం కలుగుతుందని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు. అయితే ఈమేరకు రాజ్యాంగ సవరణలు చేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుత రాజ్యాంగ నిబంధనల ప్రకారం రాజ్యాంగం 83వ ఆర్టికల్ రాజ్యసభ పూర్తిగా రద్దు కావడమనేది లేకుండా చూస్తుంది. రాజ్యాంగ 85 వ అధికరణ పార్లమెంటను సమావేశ పర్చడం, సమావేశాలను ముగించడానికి సంబంధించినది. ఏడాదిలో కనీసం రెండు సార్లయినా పార్లమెంట్‌ను సమావేశపర్చాలని ఈ అధికరణ చెబుతోంది. అంటే ప్రతి రెండు సమావేశాల మధ్య వ్యవధి ఆరు మాసాలకు మించరాదు. ఆర్టికల్ 172 ఎమర్జెన్సీ పొడిగింపునకు సంబంధించింది. ఆర్టికల్ 175 రాష్ట్ర శాసన సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడం, వాటికి సందేశాలను పంపించడాన్ని నిర్దేశిస్తుంది. 356 అధికరణ రాష్ట్రాల్లో కల్లోల పరిస్థితులు ఏర్పడినప్పుడు వాటిని నివారించడంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనప్పుడు కేంద్రం జోక్యం చేసుకుని అక్కడి పరిస్థితులను చక్కదిద్దడానికి వీలు కల్పిస్తుంది.ఇప్పుడు ఈ అన్ని అధికరణాలను తగు రీతిలో సవరిస్తే కానీ జమిలి ఎన్నికలు అమలు చేయడం సాధ్యం కాదు. ప్రపంచంలో జమిలి ఎన్నికల సంప్రదాయం బెల్జియం, స్వీడన్, దక్షిణాఫ్రికాలో ఉంది. ఇదిలా ఉండగా లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు కేంద్రానికి రూ. 4 వేల కోట్లు వరకు ఖర్చవుతుందని గణాంకాలు చెబుతున్నాయి. ఇక అసెంబ్లీ ఎన్నికల ఖర్చు వేరుగా ఉంటోంది. ప్రభుత్వ అధికారిక వ్యయం కాకుండా వివిధ పార్టీలు, అభ్యర్థులు చేసే ఖర్చు అనేక రెట్లు ఉంటుందని ఇప్పుడు జమిలి ఎన్నికలు అమలులోకి వస్తే అంత చాలా వరకు తగ్గుతుందని బిజెపి, దాని మిత్రపక్షాలు చెబుతున్నాయి. అంతేకాకుండా పరిపాలన కుంటుపడకుండా నివారించవచ్చని భరోసా ఇస్తున్నాయి.. ఏదేమైనా ఈ జమిలి ఎన్నికల నిర్వహణ ఎన్నో చిక్కులు, సవాళ్లతో ముడిపడి ఉందన్నది వాస్తవం.

# 300 ఏళ్ల నాటి సంభాల్ శివాలయం..
# 46ఏళ్ళుగా ఎందుకు క్లోజ్ చేశారు? ఎంత స్థలం ఆక్రమణకు గురైందో తెలుసా..!





ప్రస్తుతం అందరి దృష్టి సంభాల్ ప్రాంతంలో వెలుగులోకి వచ్చిన శివాలయం మీదనే ఉంది. ఈ ఆలయం 1978లో అల్లర్లు జరిగిన తర్వాత మూసి వేయబడింది. అంతకు ముందు ఈ ప్రాంతంలో 42 హిందూ కుటుంబాలు నివసించేవి. 1978లో అల్లర్లు జరిగిన తర్వాత హిందూ కుటుంబాలు క్రమంగా ఈ ప్రాంతం నుంచి వలస వెళ్ళిపోయాయి. తర్వాత ఆలయాన్ని ఆక్రమించి గుడి పైభాగంలో ఉన్న బాల్కనీలను ఆక్రమణదారులు తొలగించారు. ఆలయ ప్రదక్షిణ మార్గం కూడా ఆక్రమణకు గురైంది. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో 46 ఏళ్లుగా మూతపడిన శివాలయాన్ని అధికారులు తెరిచారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఈ ఆలయ ఆక్రమణలపై సమాచారం అందుకున్న పరిపాలన బృందం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పుడు ఈ పురాతన ఆలయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఆలయాన్ని శుభ్రం చేశారు. ఆలయంలో శివలింగంతో పాటు హనుమాన్ విగ్రహం కూడా ఉంది. అంతేకాదు ఈ ఆలయ ప్రాంగణంలో ఒక పురాతన బావి కూడా ఉన్నట్లు పరిశోధనకారులు గుర్తించారు. అక్కడ జరిపిన తవ్వకంలో మరో మూడు విగ్రహాలు వెలుగులోకి వచ్చాయి. సంభాల్‌లోని ఖగ్గు సరాయ్ ప్రాంతంలోని ఈ ఆలయన్ని కార్తీక శంకర ఆలయంగా గుర్తించారు. అంతేకాదు ఈ ఆలయం సుమారు 300 సంవత్సరాల నాటిదని చెబుతున్నారు. అప్పటి సంఘటనలను గుర్తుచేసుకుంటూ 82 ఏళ్ల విష్ణు శరణ్ రస్తోగి ఈ ప్రాంతం గతంలో హిందువుల ఆధిపత్యంలో ఉండేదని.. ఈ కార్తీక శంకర ఆలయం హిందువుల విశ్వాసానికి కేంద్రంగా ఉందని చెప్పారు. అయితే 1978 అల్లర్ల తర్వాత హిందూ కుటుంబాలు ఈ ఆలయంలో పూజలు చేయడం మానివేశాయన్నారు.

### హిందువులు ఎందుకు వలస వెళ్ళారంటే..

కొన్ని వంటల ఏళ్ల క్రితం పూర్వీకులు ఈ ఆలయాన్ని నిర్మించారని విష్ణు శరణ్ రస్తోగి (82 సంవత్సరాలు) చెప్పారు. ఈ ఆలయానికి దగ్గరలో ఒక రావి చెట్టు ఉంది. ఒక బావి కూడా ఉంది. ప్రజలు ఉదయం, సాయంత్రం ఆలయానికి వచ్చి దర్శనం చేసుకునేవారు. బావి దగ్గర దేవుడిని తలచుకుంటూ కీర్తనలు చేసేవారని చెప్పారు విష్ణు విష్ణు శరణ్. అయితే 1978లో ఈ ప్రాంతలో అల్లర్లు జరిగాయి. అప్పుడు హిందువులు భయంతో ప్రాణాలను అరచేతిట్లో పెట్టుకుని ఈ ప్రాంతం నుంచి పారిపోయారు. చుట్టుపక్కల ముస్లిం జనాభా ఉండడంతో భయంతో ఇక్కడ నుంచి వలస వెళ్లిపోయారు. విష్ణు శరణ్ రస్తోగి ఈ ప్రాంతం గురించి ఇంకా అనేక విషయాలను పంచుకున్నారు. ఈ ప్రాంతంలో 40 నుంచి 42 హిందూ కుటుంబాలు నివసిస్తుండేవని.. సమీపంలోనే ముస్లిం కుటుంబాలు నివసిస్తూ ఉండేవారని చెప్పారు. అందరిలో సోదరభావం చాలా ఉండేది. ఆలయంలో అన్ని మత సంప్రదాయాలు జరిగాయని చెప్పారు. ఈ ప్రాంతంలోని తమ పూర్వీకులకు సంబంధించిన చివరి ఇల్లు 2005లో అమ్మివేసినట్లు తెలిపారు.



ఆలయం చుట్టూ 4 అడుగుల మేర ప్రదక్షిణ మార్గం ఉండేది.


విష్ణు శరణ్ ఈ ఆలయం గురించి ఇంకా అనే విషయాలను పంచుకున్నారు. ఈ ఆలయంలో పూజ చేయడానికి, హారతి ఇవ్వడానికి ఎవరూ మిగిలి లేరు. తమ ఇంటిని కూడా ముస్లిం కుటుంబానికి అమ్మేశామని చెప్పారు. అనంతరం స్థానికులు గుడి పైభాగంలో బాల్కనీలు తీశారు. ఆలయం చుట్టూ 4 అడుగుల ప్రదక్షిణ మార్గం ఉండేది. అయితే గుడి ముందు భాగం మినహా మూడు వైపులా ఆక్రమణకు గురైందని అన్నారు.గుడి తాళం తమ కుటుంబం వద్దే ఉందని.. ఆ ఆలయ నిర్వహణ తమ కుటుంబానికే చెందింది. అయితే తాము ఆ గుడిని తెరవలేదు, పూజలు చేయలేదు. 40 ఏళ్ల క్రితమే గుడిలో పూజలు చేసేందుకు పూజారిని ఏర్పాటు చేశానని .. అయితే ఆ పూజారికి గుడికి వెళ్లే ధైర్యం చేయలేదు.. ముందు ఆ పుజారీ గుడిలో పూజ చేయడానికి రెండు మూడు రోజులు వెళ్ళాడు.. ఆ తర్వాత ఆ పుజారీ గుడికి వెళ్లి పూజ చేయడనికి నిరాకరించాడని చెప్పారు. ఆక్రమణదారులు బావిని మూసివేశారని, కారు పార్క్ చేసేందుకు దానిపై ర్యాంప్‌ను ఏర్పాటు చేశారని విష్ణు శరణ్ చెప్పారు. గుడి కోసం భూమి తమ కుటుంబం ఇచ్చిందని అన్నారు. ఈ గుడి సుమారు 300 సంవత్సరాల క్రితం నుంచి ఉందని.. కాలక్రమంలో ఈ ప్రాంతంలో హిందువులు తక్కువ అవడంలో ఆలయంలో పూజలు ఆగిపోయాయని తెలిపారు.

# కొరుకుడుపడని కొయ్యగా మారిన దేశ రాజధాని..
# ఈసారైనా కమలనాథుల కల నెరవేరేనా..?

భారతీయ జనతా పార్టీ కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. కానీ దేశ రాజధాని ఢిల్లీలో మాత్రం మూడు దశాబ్దాలుగా అధికారం ఆ పార్టీకి అందని ద్రాక్షగా మిగిలిపోయింది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ కలిసి పోటీ చేసినా సరే క్లీన్ స్వీప్ చేసిన కమలదళం అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి చతికిలపడుతోంది. చివరిసారిగా 1993లో గెలుపొందిన ఆ పార్టీ, మళ్లీ ఇప్పటి వరకు అధికారం చేజిక్కించుకోలేకపోయింది. మరో రెండు నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి ఎలాగైనా గెలిచి తీరాలన్న పట్టుదలతో కమలదళం ఉంది. బీజేపీకి సైంద్ధాంతిక మాతృసంస్థ 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ' కూడా రంగంలోకి దిగి బీజేపీ గెలుపు కోసం వ్యూహాలు అమలు చేస్తోంది. వరుసగా రెండు పర్యాయాలు గెలిచి అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ ను ఈ సారి ఎలాగైనా నిలువరించాలి ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో పార్టీ ఓటుబ్యాంకును కాపాడుకోవడంతో పాటు సామాజిక సమీకరణాలు, భావోద్వేగ అంశాలను తెరపైకి తెస్తోంది. మరోవైపు బీజేపీ, దాని అనుబంధ సంఘాలు, సంఘ్ పరివార్ ఢిల్లీలోని ప్రతి ఇంటినీ చుట్టేసే ప్రయత్నాలు చేస్తున్నాయి. తాజాగా జరిగిన 4 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో హర్యానా, మహారాష్ట్రలో అనూహ్య విజయం సాధించిన కమలదళం ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలుపొంది దశాబ్దాలుగా అందకుండా పోతున్న అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలని చూస్తోంది. ఎన్నికల తేదీలు ఇంకా ప్రకటించక ముందే అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన ప్రాథమిక కసరత్తు ఇప్పటికే పూర్తిచేసింది. త్వరలోనే మొత్తం 70 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది.

పకడ్బందీగా అభ్యర్థుల ఎంపిక

ఏ పార్టీకైనా తమ సొంత బలానికి తోడు అభ్యర్థుల బలం కూడా తోడైతేనే విజయం వరిస్తుంది. అందుకే అన్ని రాజకీయ పార్టీలు బలమైన అభ్యర్థుల కోసం గాలం వేస్తుంటాయి. ఈ క్రమంలోనే పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల విషయంలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల ఎంపికపై తీవ్ర కసరత్తు చేసింది. క్షేత్రస్థాయిలో బలమైన ముద్ర, ఓటర్లలో ఆదరణ కలిగిన నేతలకు టికెట్ ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే వరుసగా 2 పర్యాయాలు ఓడిపోయిన నేతలకు ఈసారి టికెట్ ఇవ్వడం లేదు. మరోవైపు మీనాక్షి లేఖి, పర్వేశ్ వర్మ, రమేశ్ బిధూరి వంటి నగరవ్యాప్త ప్రభావం కలిగిన సీనియర్ నేతలను ఆమ్ ఆద్మీ పార్టీ కి వ్యతిరేకంగా ఎన్నికల వాతావరణాన్ని తయారుచేయగలరని అధినాయకత్వం భావిస్తోంది. ఎన్నికల ప్రచారంలో వారికి కీలక బాధ్యతలు అప్పగించే



అవకాశాలున్నాయి. వారితో పాటు ఆమ్ ఆద్మీ పార్టీని వీడి బీజేపీలో చేరిన రాష్ట్ర మాజీ మంత్రి కైలాష్ గెహ్లోట్‌కు జాట్ సామాజికవర్గంలో గట్టి పట్టుంది. ఆయనను నజఫ్‌గఢ్ నుంచి బరిలోకి దించే అవకాశాలున్నాయి. మాజీ ముఖ్యమంత్రి మదన్‌లాల్ ఖురానా కుమారుడు హరీష్ ఖురానాను మోతీనగర్ నుంచి పోటీ చేయించవచ్చు. మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడంతో పాటు కొత్త ముఖాలను పరిచయం చేయడం కోసం సగం స్థానాలను కొత్తవారికి కేటాయించనున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అంటే కనీసం 35 స్థానాల్లో కొత్త అభ్యర్థులు బరిలోకి దిగే అవకాశాలున్నాయి. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో "చావో రేవో" అన్నట్టుగా శ్రమించిన కమలదళం.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను అంతకంటే సీరియస్‌గా తీసుకుని పోరాడాలని చూస్తోంది.

కోర్ ఓట్‌బ్యాంకు విస్తృతికి వ్యూహం

ఢిల్లీలో భారతీయ జనతా పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో 30 శాతాన్ని మించిన ఓటుబ్యాంకు ప్రతిసారీ ఉంటోంది. నగరంలోని వ్యాపారవర్గాలు బీజేపీకి ఎల్లవేళలా మద్ధతుగా నిలుస్తున్నారు. వారితో పాటు విద్యాధిక వర్గాలు, కొన్ని సామాజికవర్గాలు బీజేపీకి బలమైన ఓటుబ్యాంకుగా నిలిచాయి. అయితే ప్రత్యర్థి ఆమ్ ఆద్మీ పార్టీ ఏకంగా 50 శాతాన్ని మించి ఓటుబ్యాంకు కైవసం చేసుకుంటున్నప్పుడు ఈ బలం సరిపోదు. అందుకే ఈసారి ఓటుబ్యాంకును విస్తరించుకోవడంపై కమలనాథులు దృష్టి పెట్టారు. తమ ఓటుబ్యాంకు చేజారకుండా కాపాడుకోవడం ఒకెత్తయితే.. కొత్త ఓటుబ్యాంకును సృష్టించుకోవడం మరో ఎత్తు. కొత్త ఓటుబ్యాంకు తయారు చేసుకోవాలి అంటే ప్రత్యర్థి ఓటుబ్యాంకును చెదరగొట్టి తమవైపు ఆకట్టుకోవాలి.ఢిల్లీలోని మురికివాడల్లో నివసించే పేద, నిరుపేద ఓటర్లు ఆమ్ ఆద్మీ పార్టీ (%ూూ్రా%)కు బలమైన ఓటు బ్యాంకుగా ఉన్నారు. ఈ క్రమంలో ఢిల్లీలోని 1,194 బస్తీలు, మురికివాడల్లో రాత్రి పూట పార్టీ నేతలు గడిపేలా కార్యక్రమాలు రూపొందించారు. ఇప్పటికే పలువురు నేతలు బస్తీ నిద్రలు చేస్తున్నారు. తద్వారా బస్తీ ప్రజల సమస్యలు తెలుసుకుని, వారికి భరోసా కల్పించవచ్చని భావిస్తున్నారు. ఉచిత పథకాలకు ఆకర్షితులై ఆమ్ ఆద్మీ పార్టీకి ఓటేస్తున్నవారిలో ఇలాంటి బస్తీ ఓటర్లే ఎక్కువ సంఖ్యలో ఉన్నారని పార్టీ నాయకత్వం గ్రహించింది. అందుకే బస్తీ ఓటర్లను లక్ష్యంగా చేసుకుని వివిధ రకాల ప్రచార కార్యక్రమాలను రూపొందించుకుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించి చెప్పడంతో పాటు వారి అవసరాలకు తగ్గ హామీలను మేనిఫెస్టోలో చేర్చేందుకు ప్రయత్నిస్తోంది.

తెరవెనుక సంఘ్ వ్యూహాలు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ హర్యానా, మహారాష్ట్రలో మాదిరిగా తెరవెనుక అనేక వ్యూహాలను అమలు చేస్తోంది. ఆరెస్సెస్ జాయింట్ జనరల్ సెక్రటరీ అరుణ్ కుమార్ ఢిల్లీలోనే మకాం పెట్టి అనేక సమావేశాలు నిర్వహించారు. బీజేపీ %-% ఆరెస్సెస్ మధ్య మెరుగైన సమన్వయం కోసం ప్రయత్నిస్తున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ స్థాయికి తగ్గ నేత ప్రస్తుతం ఢిల్లీ బీజేపీలో లేరని ఆరెస్సెస్‌కు కూడా తెలుసు. అయితే వరుసగా పదేళ్లు అధికారంలో ఉన్న ఆప్ సర్కారుపై ప్రజల్లో ఏర్పడ్డ వ్యతిరేకతను కేజ్రీవాల్‌పై అస్త్రంగా మలచుకోవాలని చూస్తోంది.ప్రజలకు పరిమిత యూనిట్ల వరకు ఉచిత కరెంట్, ఉచిత నల్లా నీరు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి ప్రజాకర్షక ఉచిత పథకాలతో ఓటర్లను ఆకట్టుకుంటూ రెండు పర్యాయాలు అధికారం సాధించిన ఆమ్ ఆద్మీ పార్టీ, రోడ్లు, మురుగునీటి నిర్వహణ, తాగునీటి సరఫరా విషయంలో విమర్శలు ఎదుర్కొంటోంది. ఢిల్లీ మద్యం పాలసీ అక్రమాల కేసు ద్వారా కేజ్రీవాల్‌పై ఇంతకాలం ఉన్న 'నీతి-నిజాయితీ' ముద్ర కూడా చెరిగిపోయింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ సైతం పునర్ వైభవం కోసం శ్రమిస్తోంది. ఢిల్లీలో ఆప్ ఎదుగుదల కాంగ్రెస్ పార్టీనే తీవ్రంగా దెబ్బతీసింది. ఆ పార్టీ ఓటుబ్యాంకు పూర్తిగా చెల్లాచెదురైపోయింది. ఈ సారి కాంగ్రెస్ పార్టీ ఆప్‌తో కలిసి పోటీ చేయడం లేదు. తద్వారా మైనారిటీలు, మరికొన్ని వర్గాల ఓట్లను కాంగ్రెస్ చీల్చడం కూడా బీజేపీకి కలిసొచ్చే అవకాశం ఉంది. వీటన్నింటినీ సద్వినియోగం చేసుకుంటే అధికారం చేజిక్కించుకోవడం కష్టమేమమీ కాదని కమలదళం అంచనా వేస్తోంది.

# దేశంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్న
# స్వచ్ఛ భారత్ మిషన్.. షాక్‌కు గురిచేస్తున్న గణాంకాలు!

మహాత్మా గాంధీ కలలుగన్న పరిశుభ్ర భారతావనిని సాధించడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని గాంధీ జయంతి సందర్భంగా 2014, అక్టోబర్ 2న ప్రధాని మోదీ స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. స్వచ్ఛ భారత్ మిషన్ పదేళ్లుగా కొనసాగుతోంది. స్వచ్ఛభారత్ కార్యక్రమం దేశంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. స్వచ్ఛతతో పాటు ఆరోగ్యానికి వ్యాయామం లాంటిది అంటుంటారు ప్రధాని మోదీ.ఒక దశాబ్దం క్రితం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వచ్ఛ భారత్ అభియాన్‌ను ప్రారంభించినప్పుడు కేవలం ఐదుగురిలో ఒక్కరు మాత్రమే ఇప్పుడు సగానికి పైగా భారతీయ గృహాలు టాయిలెట్ క్లీనర్‌లను ఉపయోగిస్తున్నారు. ఇతర లక్ష్యాలతో పాటు, మరిన్ని మరుగుదొడ్లను నిర్మించడం, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణను మెరుగుపరచడం ద్వారా బహిరంగ మలవిసర్జన సమస్యను తొలగించడం మిషన్ లక్ష్యం.2014లో టాయిలెట్ క్లీనర్లు వినియోగం 19% శాతం, , ఫ్లోర్ క్లీనర్ల వాడకం 8% మాత్రమే. ఒక నివేదిక ప్రకారం, ఇది రెండింతలు పెరిగింది. 2024లో 53% కుటుంబాలు టాయిలెట్ క్లీనర్‌లను ఉపయోగిస్తున్నాయి. 22% ఫ్లోర్ క్లీనర్‌లను కొనుగోలు చేస్తున్నాయి. అంటే 128 మిలియన్లకు పైగా కొత్త కుటుంబాలు టాయిలెట్ క్లీనర్‌లను కొనుగోలు చేస్తున్నాయి. 52 మిలియన్ కుటుంబాలు ఫ్లోర్ క్లీనర్లను వినియోగిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.దాగి ఉన్న ప్రమాదాల గురించి వినియోగదారులను అప్రమత్తం చేయడం నుండి మెరుగైన పరిశుభ్రత పద్ధతుల గురించి అవగాహన కల్పించడం వరకు, %=వషెఎత్ దీవఅషెఅంవతీ, ఎఅఅసబర్ఘఅ ఖఅఅశ్రీవజవతీ, ఙఎబతీ% వంటి



బాత్రూమ్ పరిశుభ్రత ఉత్పత్తుల విక్రయదారులు కూడా సహకరిస్తున్నారు. "స్వచ్ఛ్ భారత్ అభియాన్ కింద గ్రామీణ గృహాల టాయిలెట్ల నిర్మాణం పరిశుభ్రత గురించి అవగాహన పెంచడంలో సహాయపడింది, తద్వారా శుభ్రపరిచే ఉత్పత్తుల అవసరం. దేశంలో పట్టణ ప్రాంతాల్లో హౌసింగ్ సెగ్మెంట్ వృద్ధి, అవగాహన ఉన్న కొనుగోలుదారుల సంఖ్య పెరుగుదల కారణమని డాబర్ మార్కెటింగ్ హెడ్ (హెూమ్ కేర్) వైభవ్ రాఠి అభిప్రాయపడ్డారు.భారతదేశం ఉపరితల క్లీనర్ మార్కెట్ విలువ సుమారు రూ.4,200 కోట్లు అని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో టాయిలెట్ క్లీనర్ల వాటా రూ.2,000 కోట్లు. దశాబ్దం క్రితం ఈ వర్గం ఎక్కువగా నగర కేంద్రంగా ఉండేదని నివేదిక పేర్కొంది. అయితే ఇప్పుడు అందులో చాలా మార్పు వచ్చింది. ఒక దశాబ్దం క్రితం, టాయిలెట్ క్లీనర్‌లను కొనుగోలు చేసే గృహాలలో 82% పట్టణ ప్రాంతాల్లో ఉండేవి. ఫ్లోర్ క్లీనర్ల కోసం 90% మంది ఉన్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో 52% వినియోగదారులు పెరిగినట్లు వరల్డ్‌ప్యానెల్ విభాగం దక్షిణాసియా మేనేజింగ్ డైరెక్టర్ కె రామకృష్ణన్ అన్నారు. "స్పష్టంగా, స్వచ్ఛ భారత్ అభియాన్ భారతీయ ఇళ్లలో పరిశుభ్రత ప్రాముఖ్యతను పెంచింది. తయారీదారులు గృహ పరిశుభ్రత వర్గాల్లోకి రాణించడానికి దోహదపడింది. 2014లో ప్రారంభించినప్పటి నుండి, స్వచ్ఛ భారత్ అభియాన్ 5,00,000 గ్రామాలకు బహిరంగ మలవిసర్జన రహిత ప్లస్ హెూదాను సాధించింది. గ్రామీణ పారిశుధ్యం 39% నుండి 100%కి పెరిగింది. ఇది కాకుండా, అక్షయ్ కుమార్ నటించిన టాయిలెట్ ఏక్ ప్రేమ్ కథ (2017) కూడా గ్రామీణ ప్రాంతాల్లో టాయిలెట్ల ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని ఈ సందేశాన్ని ఇంటికి తీసుకెళ్లడానికి ప్రయత్నించింది. పరిశుభ్రత ఉత్పత్తులను విక్రయించే కంపెనీలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతను పెంపొందించుకున్నాయి. ఉదాహరణకు, హిందుస్థాన్ యూనిలీవర్ 2016లో సువిధ కేంద్రాలుగా పిలవబడే కమ్యూనిటీ టాయిలెట్ బ్లాక్‌లను ప్రారంభించింది. ఇప్పుడు వాటి సంఖ్య 16కి కుదించుకుపోయింది. అంటే దీన్ని బట్టి పరిశుభ్రత పట్ల ప్రతిఒక్కరిలో అవగాహన పెరుగుతోంది

## అల్పపీడనం - మూడురోజులపాటు వానలు



అమరావతి : దక్షిణ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నేడు, రేపు, మూడురోజులపాటు ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. వాతావరణ శాఖ అధికారుల వివరాల మేరకు నిన్నటి ఆగ్నేయ బంగాళాఖాతంలోని ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం ఉదయం దక్షిణ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీని అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 3.1 కి.మీ ఎత్తు వరకు వరకు విస్తరించింది. తరువాత రెండు రోజులలో బాగా గుర్తించబడిన అల్పపీడనంగా బలపడి పశ్చిమ-వాయువ్య దిశగా తమిళనాడు తీరం వైపు కదిలే అవకాశముంది. పలుచోట్ల ఈశాన్య గాలులు వీస్తాయి. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలలో, దక్షిణ కోస్తా, రాయలసీమలోనూ ఈ మూడు రోజులపాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది.

## ఆర్థికమంత్రి ఆరోపణలపై గట్టి కౌంటరిచ్చిన ఖర్గే




న్యూఢిల్లీ : పార్లమెంటు శీతాకాల సమావేశాలు కొనసాగుతున్నాయి. సోమవారం రాజ్యసభలో భారత రాజ్యాంగంపై అధికార, ప్రతిపక్షాల మధ్య వాడి వేడి చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే గట్టిగా కౌంటరిచ్చారు. కులగణనకు వ్యతిరేకిస్తున్న బిజెపి, అందరినీ మోసం చేసేందుకు జుమ్లా (అసత్యాలు) వల్లెవేస్తోందని, తమ పార్టీని నిందిస్తోందని ఖర్గే మండిపడ్డారు. బిజెపి కన్నా వేగంగా తమ ప్రభుత్వమే వేగంగా మహిళా రిజర్వేషన్లను అమలు చేస్తుందని అన్నారు. కుటుంబ పాలన కోసం కాంగ్రెస్ యథేచ్ఛగా రాజ్యాంగ సవరణలు చేసిందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆరోపించారు. 1976, డిసెంబర్ 18న అప్పటి రాష్ట్రపతి 42వ రాజ్యాంగ సవరణ చట్టానికి ఆమోదం ప్రకటించడంతో ఎమర్జెన్సీ విధించారని అన్నారు. ఎమర్జెన్సీ సమయంలో సరైన కారణం లేకుండానే లోక్‌సభ పదవీకాలాన్ని పొడిగించారని, ఆ సమయంలో మరో రాజ్యాంగ సవరణతో మొత్తం ప్రతిపక్షాన్ని జైలుకు పంపారని ఆరోపించారు.

## రాజ్యాంగంపై చర్చ.. కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన నిర్మలా సీతారామన్



ఢిల్లీ: రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ సమయంలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, కాంగ్రెస్‌పై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ విమర్శలు గుప్పించారు. పౌర హక్కులను పరిమితం చేయడానికి కాంగ్రెస్ పదే పదే రాజ్యాంగాన్ని సవరించిందని ఆరోపించారు. రాజ్యసభలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. 'గత ఏడు దశాబ్దాలలో మన రాజ్యాంగంలో అనేక సవరణలు జరిగాయి. నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంలో రాజ్యాంగంలో వాక్ స్వాతంత్ర్యాన్ని అరికట్టేలా మొదటి సవరణ జరిగింది. మీడియా సంస్థలు ముఖ్యంగా రాజకీయంతో సంబంధం ఉన్న కీలక అంశాలపై లోతుగా విచారణ జరపరడాన్ని నెహ్రూ వ్యతిరేకించారని, పత్రికా స్వాతంత్ర్యాన్ని తగ్గించేందుకు రాజ్యాంగాన్ని ఆమోదించిన ఏడాదిలోపే రాజ్యాంగాన్ని సవరించారని పేర్కొన్నారు. గత వారం లోక్‌సభలో రెండు రోజులపాటు జరిగిన వాడివేడి చర్చల తర్వాత ఇవాళ సీతారామన్ రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చను ప్రారంభించారు . ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌పై ప్రతిపక్ష పార్టీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ చర్చ జరిగింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రాజ్యాంగంపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు కీలక డిమాండ్ చేశాయి. దీంతో పాటు అదానీ వివాదం, జార్జ్ సోరోస్ ఆరోపణలు , ఉపరాష్ట్రపతి,రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్‌పై విపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసు వంటి అంశాలు ఉభయ సభల్లో గందరగోళానికి దారి తీశాయి.

## 90 ఏళ్ల తర్వాత.. గడగడలాడించిన చిడో తుపాన్



పారిస్ : చిడో తుపాన్ బీభత్సం సృష్టిస్తోంది. హిందు మహాసముద్రంలో ఏర్పడిన చిడో తుపాను తీవ్రతతో మయోట్ ద్వీపంలో వందల మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది నిరాశ్రయులైనట్లు ఫ్రాన్స్ హెూం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. తుపాను కారణంగా గంటకు దాదాపు 220 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు ద్వీపాన్ని అతలా కుతలం చేశాయి. ఫలితంగా తాత్కాలిక గృహాలు, ప్రభుత్వ భవనాలు, ఆసుపత్రులు దెబ్బతిన్నాయని అధికారులు వెల్లడించారు. ఈ గాలుల ప్రభావం వల్ల ప్రాణ,ఆస్తినష్టం భారీ ఎత్తున జరిగిందని అన్నారు. గత 90 ఏళ్లలో మయోట్‌ను తాకిన అత్యంత భయంకరమైన తుపాను ఇదేనని అధికారులు చెప్పారు. ఫ్రాన్స్ ప్రభుత్వ లెక్కల ప్రకారం.. ఆదివారం ఉదయం చిడో తుఫాన్ ప్రారంభంలో 11మంది మరణించగా, 250 మందికి పైగా తీవ్ర గాయాలైనట్లు ధృవీకరించింది. అయితే మరణాలు, గాయపడ్డ వారి సంఖ్య సోమవారం ఉదయం నాటికి గణనీయంగా పెరిగినట్లు అంచనా వేసింది. శనివారం తుఫాను కారణంగా మయోట్ ద్వీపం పూర్తిగా దెబ్బ తిన్నదని, జరిగిన ప్రాణనష్టం, ఆస్తినష్టం ఎంతనేది అంచనా వేయడం కష్టంగా ఉందన్నారు. ఫ్రాన్స్ రెస్క్యూ టీమ్‌లు.. మెడిసిన్, ఆహారంతో పాటు ఇతర నిత్యవసర వస్తువుల్ని ద్వీపానికి తరలించినట్లు మయోట్ ద్వీప ప్రభుత్వ అధికారులు పేర్కొన్నారు.

# వక్ఫ్ బిల్లుతో పాలిటిక్స్

### కర్నాటక, కేరళ, తమిళనాడులో
### ఆ పార్టీ నాయకుల తీరు
### కాషాయపార్టీ తీరుపై ముస్లిం సంఘాలు, ప్రతిపక్షాల ఆగ్రహం




న్యూఢిల్లీ : దేశంలో వక్ఫ్ బిల్లుతో హిందూత్వ రాజకీయాలకు బీజేపీ యత్నిస్తున్నది. ఆ పార్టీ నాయకులు ఈ బిల్లును తమ రాజకీయ ప్రయోజనాలకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి మరీ ఈ విధంగా వ్యవహరిస్తున్నారు. కర్నాటక, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో పలు సందర్భాల్లో బీజేపీ నాయకుల తీరు దీనికి అద్దం పడుతున్నది. కర్నాటకలోని బీజేపీ నాయకులు వక్ఫ్ బోర్డుకు వ్యతిరేకంగా తీవ్ర ప్రచారాన్నే చేస్తున్నారు. ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు అందివచ్చిన ప్రతి సందర్భాన్నీ ఉపయోగిం చుకుంటున్నారు. అక్టోబర్‌లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య.. విజయపుర జిల్లాలోని రైతులను కలిశారు. హొనవాడలోని ఒక గ్రామంలో 1500 ఎకరాలకు సంబంధించి వక్ఫ్ బోర్డుకు చెందిన భూమిని రైతులు ఆక్రమించారంటూ అప్పటికే వారికి నోటీసులు వచ్చాయి. దీంతో రంగంలోకి దిగిన బీజేపీ ఎంపీ.. ఎలాంటి ఆధారాలు, వివరణ లేకుండా నోటీసులు పంపటాన్ని ప్రశ్నించారు. గెజిట్ నోటిఫికేషన్‌లో తప్పిదం కారణంగా విజయపుర గ్రామంలోని రైతులకు నోటీసులు అందాయని కర్నాటక ప్రభుత్వం పేర్కొన్నది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల రైతులకూ జారీ అయిన నోటీసులను ఉపసంహరించుకోవాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికారులను ఆదేశించారు.ఇలాంటి నోటీసులు హావేరి జిల్లాలో హింసకు దారితీశాయి. కడకోల్ జిల్లాలోని గ్రామస్థులు తమ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా క్లెయిమ్ చేస్తారనే భయంతో ముస్లిం నివాసితుల ఇండ్లపై రాళ్లు రువ్వారు. ఇదే ఆందోళనతో ధార్వాడ్, కల్బుర్గిలో కూడా నిరసనలు వెల్లువెత్తాయి. వక్ఫ్‌బోర్డులు భూ ఆక్రమణదారులనీ, దానిని తక్షణమే సవరించాల్సిన అవసరమున్నదనే అభి.ప్రాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ తీవ్ర ప్రయత్నాలనే చేసింది. ఈ చర్యలే రైతులు, ప్రజల్లో ముస్లింల పట్ల ఆగ్రహానికి కారణమవుతున్నాయని అంటు న్నారు.సాధారణంగా బీజేపీ శ్రేణులు, హిందూత్వ శక్తులు.. ముస్లింల పట్ల ద్వేషాన్ని పెంచటానికి 'జిహాద్' పదాన్ని ఉపయోగిస్తుంటారు. లవ్ జిహాద్ అంటూ ఆ మధ్య సాక్షాత్తూ బీజేపీ ప్రభుత్వాలే చర్యలు తీసుకున్న సందర్భాలున్నాయి. ఇప్పుడు దీనిని భూములకూ అన్వయిస్తున్నాయి బీజేపీ, దాని అనుబంధ హిందూత్వ శక్తులు. దీనికే 'ల్యాండ్ జిహాద్' అనే పేరును పెట్టాయి. వక్ఫ్ చట్టం, 1995లో నిర్దేశించిన అధికారాలను కలిగి ఉన్న రాష్ట్రస్థాయి సంస్థల ద్వారా వక్ఫ్ భూముల నిర్వహించబడతాయి. భారత్‌లోని ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతాని(యూటీ)కి 30 వక్ఫ్ బోర్డులున్నాయి. వక్ఫ్ బోర్డుల పనితీరుకు సవరణలు ప్రతిపాదించే బిల్లును సమీక్షించే జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) పదవీకాలాన్ని నవంబర్ 28న లోక్‌సభ పొడిగించింది. ఇప్పుడది ఫిబ్రవరి బడ్జెట్ సెషన్‌కు మారింది. వక్ఫ్ బిల్లును ప్రతిపక్షాలు, ముస్లిం సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటికే మోడీ సర్కారుకు వ్యతిరేకంగా తీవ్ర ఆందోళనలు చేపట్టాయి కూడా. వక్ఫ్ బోర్డులను భూ ఆక్రమణదారులుగా చిత్రీకరించే బీజేపీ వ్యూహం పట్ల తాము జాగ్రత్తగా ఉన్నామని ముస్లిం సంఘాలు అంటున్నాయి. పార్లమెంటు ప్యానెల్‌లో సభ్యుడు, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఎంపీ కళ్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ పార్లమెంటులో బిల్లును ముందుకు తీసుకురావటం కష్టంగా ఉన్నందున, వక్ఫ్ బోర్డులకు వ్యతిరేకంగా సాధారణ ప్రజలలో వాతావరణాన్ని సృష్టించటానికి బీజేపీ లేనిపోని సమస్యలను లేవనెత్తిందని అన్నారు. ఢిల్లీ వక్ఫ్ బోర్డు మాజీ న్యాయవాది వజీ షఫీక్ మాట్లాడుతూ "ముస్లింలను విలన్‌లుగా చిత్రీకరించటానికి, సమాజానికి వ్యతిరేకంగా ఓటర్లను పోలరైజ్ చేయటానికి ఇది బీజేపీ కొత్త ఎత్తుగడ అని హెచ్చరించారు.వక్ఫ్ ఆస్తులన్నింటినీ జాతీయం చేయాలని కర్నాటకలో బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాల్ డిమాండ్ చేశారు. గతనెల కర్నాటకలోని మూడు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగినప్పుడు కూడా బీజేపీ ఈ వివాదాన్ని ఎన్నికల అంశంగా ఉపయోగించుకున్నది. హిందువులు సాగు చేసుకుంటున్న ప్లాట్లను వక్ఫ్ ఆస్తిగా తప్పుగా గుర్తించటం ద్వారా కాంగ్రెస్ ముస్లింలను సంతృప్తి పరుస్తున్నదని బీజేపీ ఆరోపించింది. వక్ఫ్ బిల్లును సవరించే అంశం, మతపరమైన మార్గాల్లో ఓటర్లను పోలరైజ్ చేయడానికి భూ వివాదాలను ఉపయోగించుకునే బీజేపీ వ్యూహం ఇటీవలి నెలల్లో కేరళలో కూడా స్పష్టంగా కనిపిస్తున్నది. ఎర్నాకుళం జిల్లాలోని మునంబం తీరం వెంబడి ఉన్న 404 ఎకరాల భూమి వక్ఫ్ బోర్డు, 600 హిందూ, క్రైస్తవ మత్స్యకారుల కుటుంబాల మధ్య 1960ల నుంచి న్యాయపరమైన వివాదానికి కేంద్రంగా ఉన్నది. కమ్యూనిటీ సభ్యులకు చెందిన ఆస్తులపై వక్ఫ్ బోర్డు చట్టవిరుద్ధంగా క్లెయిమ్‌లు వేసిందని ఆరోపిస్తూ సైరో-మలబార్ చర్చి నేతృత్వంలోని క్రైస్తవ సంస్థలు జేపీసీకి లేఖ రాయటంతో కర్నాటక వివాదం జరిగిన సమయంలోనే ఈ విషయం మళ్లీ తెరపైకి వచ్చింది. వయనాడ్ లోక్‌సభ స్థానానికి గత నెలలో జరిగిన ఉపఎన్నికల ప్రచార ర్యాలీలో బీజేపీ ఎంపీ సురేష్ గోపి మాట్లాడుతూ.. బిల్లుకు సవరణలు వక్ఫ్ బోర్డు క్రూరత్వాన్ని అణిచివేస్తాయన్నారు. ఓటర్లు బీజేపీకి మద్దతు ఇవ్వకుంటే కేరళలోని శబరిమల ఆలయం, తమిళనాడులోని వేలంకన్ని చర్చిలపై వక్ఫ్ బోర్డు క్లెయిమ్ చేస్తుందని ఆయన హెచ్చరించారు. తమిళనాడులో వక్ఫ్ బోర్డు "ల్యాండ్ జిహాద్" అని ఆరోపించేందుకు బీజేపీ ఇదే నమూనాను అనుసరించింది. తిరుచ్చిలోని తిరుచెందురై ఆలయానికి, 600 మందికి చెందిన భూమిని వక్ఫ్ బోర్డు అక్రమంగా క్లెయిమ్ చేసిందని కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే ఆరోపించారు. వక్ఫ్ బిల్లును సమీక్షిస్తున్న పార్లమెంటరీ ప్యానెల్ సభ్యుడు, కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డులతో మొత్తం ముస్లిం సమాజాన్ని లక్ష్యంగా చేసుకోవటానికి బీజేపీ ల్యాండ్ జిహాద్ కుట్ర సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తోందని అన్నారు.

# శిరస్త్రాణం (హెల్మెట్) ఒక రక్షణాస్త్రం



'వేగం కన్నా ప్రాణం మిన్న', 'అతి వేగం ప్రాణానికే ప్రమాదం' వంటి సూక్తులు నిత్యం వింటుంటాం. బైక్ నడపడంలో తాము నేర్పరులమని, శిరస్త్రాణం అవసరం లేదని, ఇది శిరోభారం మాత్రమేనని భావిస్తుంటాం. శిరస్త్రాణం (హెల్మెట్) ఒక రక్షణాస్త్రం ద్విచక్ర వాహనదారుల తలకు భద్రత కల్పించే రక్షణ కవచం. శిరస్త్రాణంతో ప్రాణం పదిలం. 'సోదరా నెత్తిన పెట్టుకో హెల్మెట్/ అది నీ తల చుట్టూ గట్టి సాకెట్/ హెల్మెట్ వుంటే నీ లైఫ్ నాటౌట్/ హెల్మెట్ లేకుంటే నీ లైఫ్ రనౌట్' అంటాడో కవి. ఎండావానలకు, మంచు, చలి, దుమ్మూధూళికి కూడా రక్షణగా నిలుస్తుంది. యువత బైక్ ఎక్కితే చాలు మితిమీరిన వేగం, మద్యం మత్తులో నడపడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం పరిపాటిగా మారింది. ఇటీవల యువత సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్, ఓవర్‌టేక్ చేయడం, నిర్లక్ష్యంగా హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తూ నిండుప్రాణాలు బలిపెట్టుకుంటున్నారు. కుటుంబాలకు, ఆత్మీయులకు దు:ఖాన్ని మిగుల్చుతున్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్న సంఘటనలు ఇటీవల ఎక్కువయ్యాయి. 'శరీరానికి శిరస్సు ప్రధానం, ఇంద్రియాలలో నేత్రం ప్రధానం, షడ్రుచులలో ఉప్పు ప్రధానం, నదులకు నీరు ప్రధానం' అని సుభాషిత రత్నావళి చెబుతుంది. కానీ, శిరస్సుకు శిరస్త్రాణం ప్రధానం అని జీవితం చెబుతుంది. ఉరుకుల పరుగుల జీవితంలో వేగానికున్న ప్రాధాన్యత భద్రతకు ఇవ్వకపోవడంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. హెల్మెట్ లేకపోతే ఏమౌతుందిలే అన్న చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల ఎంతోమంది యువకులు ప్రాణాలను కోల్పోతున్నారు. దేశంలో ఏడాదికి సగటున 1.78లక్షల మంది రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారని, అందులో 60మంది 18నుంచి 34 ఏళ్లలోపు వారేనని సాక్షాత్తూ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల లోక్‌సభలో వెల్లడించారు. దేశంలో ప్రతి గంటకూ దాదాపు 53 ప్రమాదాలు, 19 మరణాలు జరుగుతున్నాయి. దీనిలో 45శాతం ద్విచక్ర వాహన ప్రమాదాలేనని కేంద్రమంత్రి తెలిపారు. దేశంలో ప్రస్తుతం యువ జనాభా ఎక్కువగా వుంది. అయితే, ప్రస్తుతం 15 ఏళ్ల లోపు వున్న బాలల శాతం 2036 నాటికి గణనీయంగా తగ్గనుందని 'భారతదేశంలో మహిళలు-పురుషులు 2023' నివేదిక వెల్లడిస్తోంది. దీనికంటే ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే%ొ% ద్విచక్ర వాహన ప్రమాదాలలో చనిపోతున్న వారిలో ఎక్కువమంది యువతే కావడం. రాష్ట్రంలో 99 శాతం మంది హెల్మెట్ ధరించకుండా బైక్‌లు నడుపుతున్నారని, హెల్మెట్ ధారణ తప్పనిసరి చేయాలని ఎ.పి హైకోర్టు గతంలోనే స్పష్టం చేసింది. తాజాగా 'హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని, గత జూన్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో హెల్మెట్ ధరించకపోవడం వల్ల రాష్ట్రంలో 667 మంది చనిపోయారని' తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. హెల్మెట్ వినియోగించేలా చేయడంలో పోలీసులు కఠినంగా వ్యవహరించకపోవడం వల్లే అంతమంది చనిపోయారని, పోలీసుల అలసత్వం వల్లే ఈ పరిస్థితి నెలకొందని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఒక పరిమితి వరకే బండి వేగం మన చేతుల్లో వుంటుంది. ఆ పరిమితి దాటితే ఆ వేగాన్ని కంట్రోల్ చేయడం కష్టం. వేగాన్ని నియంత్రించుకోలేకపోతే అది ప్రమాదానికి దారితీస్తుంది. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ పెట్టుకోవాలని 'మోటారు వాహనాల చట్టం 1998లోని 129, 177 సెక్షన్లు చెబుతున్నాయి. దీని ప్రకారం జరిమానా విధించడమే కాదు, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే అవకాశం కూడా వుంటుంది. మనం ప్రయాణించే రోడ్డు రేస్ ట్రాక్ కాదు. వాహనం ఎక్కగానే రేసింగ్ మూడ్‌లోకి వెళ్లిపోవడం వల్ల కోరి ప్రమాదాన్ని తెచ్చుకోవడమే అవుతుంది. టైర్లు, బ్రేకులు, బైక్ కండిషన్ పట్ల శ్రద్ధ పెట్టాలి. చాలావరకు రోడ్డు ప్రమాదాలు, టైర్లు, బ్రేకులు విఫలమవడం వల్లనే జరుగుతాయి. హెల్మెట్ ధరిస్తే ప్రాణాలు కోల్పోకుండా కనీసం గాయాలతోనైనా బయటపడే అవకాశం వుంటుంది. హెల్మెట్లు ప్రమాదాలలో మరణాన్ని నివారించగలవు, నిరోధించగలవు. అయితే, అది మాత్రమే చాలదు. బైక్ నడిపేటప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మీకే కాదు, తోటి ప్రయాణీకులకు కూడా ప్రమాదమేనన్న విషయం గుర్తించాలి. డ్రైవింగ్‌లో దరి చేరనివ్వకు నిర్లక్ష్యం. హెల్మెట్ ధరించి నిలుపుకో నీ ప్రాణం.

## దేశ ఐక్యత మా ప్రాధాన్యత.. అందుకే ఆర్టికల్ 370 రద్దు చేశాం



దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్లమెంటులో రాజ్యాంగం సాధించిన విజయాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. దేశంలోని భిన్నత్వంలో ఏకత్వం, ఏకత్వమే రాజ్యాంగ ప్రాతిపదికగా ప్రధాని అభివర్ణించారు. భిన్నత్వం, ఏకత్వం మన అనాదిగా వస్తున్న సంప్రదాయాలు, సంస్కృతిలో భాగమని అన్నారు. మనలో మనం ఐక్యంగా ఉండాలని మన రాజ్యాంగం నేర్పిందని ప్రధాని మోదీ అన్నారు. తన ప్రసంగం ప్రారంభంలో, బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రకటనను చదివి, దేశప్రజలకు ఐక్యతా సందేశాన్ని అందించారు. 75 ఏళ్ల రాజ్యాంగం సాధించిన ఈ ఘనత అసాధారణమని ప్రధాని మోదీ అన్నారు. దేశ సమైక్యత నేపథ్యంలో రాజ్యాంగ పరిషత్‌లో భాగమైన ఆ ముగ్గురు మహానుభావుల ప్రకటనను ప్రధాని చదివి వినిపించారు. దీనికి సంబంధించి పురుషోత్తం దాస్ టాండన్, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ భీంరావు అంబేద్కర్‌ల ప్రకటనలను ఆయన చదివి వినిపించారు. రాజ్యాంగ పరిషత్‌లో భీమ్‌రావ్ అంబేద్కర్ అన్నారని - ప్రజాస్వామ్యం అంటే ఏమిటో భారతదేశానికి తెలియదని కాదు. భారతదేశంలో అనేక రిపబ్లిక్‌లు ఉండే కాలం. రాజ్యాంగ నిర్మాతలకు దేశ సమైక్యత తొలి ప్రాధాన్యత అని, అందుకే మా ప్రభుత్వం ఆర్టికల్ 370ని తొలగించిందని, తద్వారా దేశంలో ఐక్యత కనిపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఆర్టికల్ 370 దేశ సమైక్యతకు గోడగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భారతదేశ ఐక్యతను బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. ఆర్టికల్ 370 దేశ సమైక్యతకు గోడలా మారింది. అందుకే రద్దు చేశామని, 'దేశ ఐక్యత మా ప్రాధాన్యత' అని ప్రధాని అన్నారు. ఆర్టికల్ 370ను 5 ఆగస్టు 2019న రద్దు చేయడం జరిగింది. ఇది కాకుండా, వన్ నేషన్ వన్ హెల్త్ కార్డ్- ఆయుష్మాన్ సేవా కార్డ్ అమలు చేయబడింది మరియు దేశంలోని సుదూర ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయడానికి వన్ నేషన్, వన్ గ్రిడ్ అమలు చేయడం జరుగుతుందన్నారు. 2014 తర్వాత ప్రజలు సులభంగా ఆహార ధాన్యాలు పొందాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. వీలైనంత ఎక్కువ మందికి రేషన్ అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. దీన్ని అందుబాటులోకి తీసుకురావడానికి, వన్ నేషన్-వన్ రేషన్ కార్డ్ ప్రారంభించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. ప్రస్తుతం దేశం మొత్తం ఒకే దేశం-ఒకే రేషన్ కార్డు వ్యవస్థ అమలులో ఉంది. ఇంతకు ముందు ఇలాంటి వ్యవస్థ లేదని మోదీ తెలిపారు. రాజ్యాంగాన్ని రూపొందించిన వారే వారసత్వ సంపదను కాపాడుకున్నారన్నారు. రాజ్యాంగ నిర్మాతల భావాలకు అనుగుణంగా జీవించిన వారు అభినందనలకు అర్హులాలని ప్రధాని మోదీ అన్నారు. మన రాజ్యాంగ నిర్మాతలకు భారతదేశపు వేల సంవత్సరాల సాంస్కృతిక వారసత్వం గురించి తెలుసు. అర్థం చేసుకున్నారు. రాజ్యాంగాన్ని రూపొందించే సమయంలో దీనిపై పూర్తి జాగ్రత్తలు తీసుకున్నారు. భారతదేశ చరిత్ర,ప్రజాస్వామ్యం చాలా గొప్పది, అందుకే దీనిని ప్రజాస్వామ్య మాత అని పిలుస్తారని మోదీ అన్నారు. నేటికి రాజ్యాంగం 75 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నదని, అయితే మన దేశంలో 25 ఏళ్లు, 50 ఏళు కూడా ముఖ్యమని, అయితే ఏం జరిగిందో గుర్తుంచుకోవాలన్నారు. మన దేశంలో ఎమర్జెన్సీ విధించారు. రాజ్యాంగాన్ని లాక్కున్నారు. రాజ్యాంగ ఏర్పాట్లు రద్దు చేశారు. పౌరుల హక్కులను దోచుకున్నారు. కాంగ్రెస్ నుదుటిపైన ఈ పాపం ఎప్పటికీ చెరిగిపోదని ప్రధాని మోదీ గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో న్యాయవ్యవస్థ రెక్కలు తెగిపోయాయని ప్రధాని మోదీ అన్నారు. ఇందిరాగాంధీ ప్రభుత్వం హయాంలో ముఖంపై రక్తం కారుతోంది, ఆపేవారు లేరు. అందువల్ల, ఇందిరా గాంధీ ఎన్నికను అనైతిక కారణాల వల్ల కోర్టు తిరస్కరించడంతో, ఆమె ఎంపీ పదవిని వదిలివేయవలసి వచ్చిందన్నారు. అప్పుడు ఆమె ఆగ్రహంతో దేశంలో ఎమర్జెన్సీని విధించారని మోదీ గుర్తు చేశారు. నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు కాంగ్రెస్ ప్రధానులు రిజర్వేషన్లపై దాడి చేశారని అన్నారు.

# ఈ లక్షణాలు షుగర్?

## వ్యాధికి సంకేతాలు కావొచ్చు... జాగ్రత్త!



మారిన జీవన శైలితో చాలా మందిలో మధుమేహం సమస్య

మొదట్లో దీనిని గుర్తించలేక తీవ్ర అనారోగ్యాల బారినపడుతున్న ప్రజలు

కొన్ని లక్షణాలను గుర్తించి జాగ్రత్త పడాలని సూచిస్తున్న నిపుణులు

మారిన ఆహార అలవాట్లు, సరిగా నిద్ర లేకపోవడం, శరీరానికి వ్యాయామం లేకపోవడంతో చాలా మంది షుగర్ (మధుమేహం) బారిన పడుతున్నారు. ఇది సైలెంట్ కిల్లర్. పైకి కనబడకుండానే శరీరాన్ని గుల్ల చేసే మహమ్మారి. మధుమేహం ఉన్నవారికి తరచూ మూత్రం రావడం, ఎప్పుడూ దాహంగా అనిపిస్తుండటం వంటి కొన్ని లక్షణాలు ఉంటాయన్న విషయం చాలా మందికి తెలుసు. కానీ మధుమేహానికి మరికొన్ని లక్షణాలు కూడా ఉంటాయని... వాటిని గమనిస్తే, ముందే జాగ్రత్త పడవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

### చర్మంలో మార్పులు

మధుమేహం బారినపడిన వారి చర్మంలో మార్పులు వస్తాయి. చర్మంపై నల్లటి ప్యాచ్ లు ఏర్పడతాయి. ముఖ్యంగా చర్మం ముడత పడే భాగాలైన మెడ వెనుక, బాహుమూలాలు, జననేంద్రియాల వంటి చోట చర్మం నల్లగా, మందంగా, గరుకుగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు.





### తరచూ ఇన్ఫెక్షన్లు సోకుతుండటం

రక్తంలో అధికంగా చక్కెర స్థాయిలు ఉంటే... శరీరంలో రోగ నిరోధక వ్యవస్థ పనితీరు దెబ్బతింటుంతతదని నిపుణులు చెబుతున్నారు. దీనితో మధుమేహం బారినపడినవారు తరచూ ఇన్ఫెక్షన్లకు లోనవుతుంటారు. ముఖ్యంగా మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, స్కిన్ ఇన్ఫెక్షన్లు వంటివి తరచూ వస్తుంటాయి. జలుబు కూడా త్వరగా వస్తుందని వివరిస్తున్నారు. ఈ లక్షణాలు తరచూ కనిపిస్తుంటే... వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

### చిగుళ్ల నుంచి రక్తం కారడం...

దంతాలు, చిగుళ్ల మధ్య సందు పెరగడం, చిగుళ్ల నుంచి తరచూ రక్తం కారడం, నోటి దుర్వాసన వంటివి 'పెరియోడాంటైటిస్' అనే వ్యాధి లక్షణాలు. మధుమేహం ఉన్నవారిలో ఈ సమస్య వచ్చే అవకాశం ఎక్కువని నిపుణులు చెబుతున్నారు. అలాంటి వారు వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

### కంటి చూపులో మార్పులు...

రక్తంలో షుగర్ స్థాయిలు తరచూ హెచ్చుతగ్గులకు గురవుతుండటం వల్ల కంటి చూపులో మార్పులు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. దృశ్యం మసకగా కనిపించడం, సరిగా ఫోకస్ చేయలేకపోవడం వంటివి అకస్మాత్తుగా మొదలవుతాయని సూచిస్తున్నారు. ఇలాంటప్పుడు నిర్లక్ష్యంగా ఉంటే కంటి చూపు దెబ్బతినే ప్రమాదం ఉంటుందని... తగిన పరీక్షలు చేయించుకుని, మందులు వాడాలని స్పష్టం చేస్తున్నారు.

### వినికిడిలో మార్పులు...

మధుమేహం, అధిక రక్తపోటు కారణంగా చెవి అంతర్భాగంలోని సూక్ష్మ రక్తనాళాలు దెబ్బతింటాయని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల ఉన్నట్టుండి వినికిడికి సంబంధించిన మార్పులు తలెత్తుతాయని వివరిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని రకాల ధ్వనులు సరిగా వినపడవని చెబుతున్నారు. మధుమేహానికి సంబంధించిన ఇతర లక్షణాలు కూడా ఉంటే... ముందు జాగ్రత్తగా పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

### మానసిక స్థితిలో మార్పులు...

మధుమేహం కేవలం శారీరకంగానే కాదు మానసికంగా కూడా సమస్యలను తెస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. రక్తంలో షుగర్ స్థాయిలు తరచూ మారిపోతుండటం వల్ల... ఉన్నట్టుండి మూడ్ మారిపోతుండటం (మూడ్ స్వింగ్), చిరాకు, కోపం, దేనిపైనా సరిగా దృష్టిపెట్టలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరిస్తున్నారు.

### తరచూ తిమ్మిర్లు రావడం...

చూడటానికి చిన్న సమస్యే అయినా తరచూ కాళ్లు, చేతుల్లో తిమ్మిర్లు రావడం, సూదులతో గుచ్చుతున్నట్టుగా ఇబ్బంది అనిపించడం కూడా మధుమేహం లక్షణాలేనని నిపుణులు చెబుతున్నారు.

### ఈ విషయం మాత్రం మరవొద్దు

పైన చెప్పినవన్నీ మధుమేహం లక్షణాలే అయినా... మరికొన్ని ఇతర ఆరోగ్య సమస్యలు, వ్యాధుల కారణంగా కూడా తలెత్తే అవకాశం ఉంటుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అందువల్ల ఈ లక్షణాలు కనిపించగానే మధుమేహం అని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచిస్తున్నారు. అలాగని ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని, వైద్య పరీక్షలు చేయించుకుని సమస్యను గుర్తించాలని, మందులు వాడాలని స్పష్టం చేస్తున్నారు.

# రోజుకు అరగంట వ్యాయామంతో జ్ఞాపకశక్తి మెరుగు:

తాజా అధ్యయనంలో వెల్లడి

లండన్ యూనివర్సిటీ కాలేజీ శాస్త్రవేత్తల తాజా అధ్యయనం

50 నుంచి 83 ఏళ్ల వయసున్న 76 మందిపై అధ్యయనం

రోజుకు అరగంట వ్యాయాయం, ఆరు గంటల నిద్ర తర్వాత జ్ఞాపశక్తి మెరుగైనట్టు గుర్తింపు

ది ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ బిహేవియరల్ న్యూట్రిషన్ అండ్ ఫిజికల్ యాక్టివిటీ'లో అధ్యయన వివరాలు



క్రమం తప్పకుండా చేసే వ్యాయామంతో ఒనగూరే ప్రయోజనాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రతి రోజూ చేసే వ్యాయామం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతోపాటు టైప్2 డయాబెటిస్ వంటివాటిని దూరంగా ఉంచుతుంది. శరీర బరువును కూడా అదుపులో పెట్టుకోవచ్చు. అయితే, కేవలం అరగంటపాటు వ్యాయామం .. బ్రిస్క్ వాకింగ్, సైక్లింగ్, డ్యాన్సింగ్ వంటివి చేయడం ద్వారా మధ్యవయసు వారు తమ మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. గంటల తరబడి వ్యాయామం తర్వాత వారి జ్ఞాపకశక్తి మెరుగవుతుందని గత అధ్యయనాలు చెప్పినప్పటికీ అది ఎంతకాలం అన్న విషయంలో స్పష్టత లేదు. తాజాగా 'ది ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ బిహేవియరల్ న్యూట్రిషన్ అండ్ ఫిజికల్ యాక్టివిటీ'లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. సగటున 50 నుంచి 83 ఏళ్ల మధ్య వయసున్న వారు మధ్యస్థం నుంచి కఠినమైన వ్యాయామం తర్వాత వారి మెదడు చురుకుదానాన్ని పొంది, జ్ఞాపకశక్తిలో గణనీయమైన మార్పును శాస్త్రవేత్తలు గుర్తించారు. తక్కువ సేపు కూర్చోవడం, ఆరుగంటలు, అంతకుమించి హాయిగా నిద్రపోవడం ద్వారా ఒక రోజల్లా వారిలో జ్ఞాపకశక్తి మెరుగైనట్టు లండన్ యూనివర్సిటీ కాలేజీ శాస్త్రవేత్తలు తెలిపారు. మొత్తం 76 మందిపై 8 రోజులపాటు నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయాన్ని వారు గుర్తించారు. రోజుకు అరగంటపాటు వ్యాయాయం, కంటి నిండా నిద్ర తర్వాత వారి జ్ఞాపకశక్తిని పరీక్షించేందుకు ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహించగా మంచి స్కోరు సాధించినట్టు అధ్యయనకారులు తెలిపారు.





## సరైన పోషకాహారం లేక రక్తహీనతతో బాధపడుతున్నవారు ఎందరో...

## ముఖ్యంగా స్త్రీలలో రక్త హీనత సమస్య మరింత ఎక్కువ

## కొన్ని రకాల పళ్లను తరచూ తీసుకుంటే ప్రయోజనం ఉంటుందంటున్న నిపుణులు

మన ఆహార అలవాట్లలో చాలా మార్పులు వచ్చాయి. జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్ తినడం ఎక్కువైంది. పైగా ఆల్కాహాల్ వంటి అలవాట్లతో మనం తినే ఆహారం నుంచి పోషకాలు శరీరానికి అందకుండా పోతున్నాయి. దానితో చాలా మందిలో ఐరన్ లోపం ఉంటోంది. ఇది రక్త హీనత సమస్యకు దారి తీస్తోంది. ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్య అధికం. రక్త హీనత కారణంగా శరీరంలో నిస్సత్తువ ఆవహిస్తుంది. రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంది. అందువల్ల మనం తీసుకునే ఆహారంలో భాగంగా కొన్ని రకాల పళ్లను చేర్చుకుంటే... ఐరన్ లోపం నుంచి బయటపడొచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలివిగో...

మల్బరి పళ్లలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ముఖ్యంగా మాంసాహారం తీసుకోనివారికి ఇవి ఎక్కువ ప్రయోజనకరం. ప్రతి 100 గ్రాముల మల్బరి పళ్లలో 2.6 మిల్లీగ్రాముల ఐరన్ ఉంటుంది. రైజిన్స్ (ఎండు ద్రాక్ష)లలో ప్రతి వంద గ్రాములకు 1.9 మిల్లీగ్రాముల ఐరన్ ఉంటుంది. దీనిలోనూ చక్కెరలు ఎక్కువ. అయితే వీటి విషయంలో మధుమేహం వంటివి ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. ప్రతి వంద గ్రాముల ఖర్జూరాలలో 0.9 మిల్లీగ్రాముల ఐరన్ ఉంటుంది. దీనిలో సహజ చక్కెరలు ఎక్కువ. ఉదయం పూట స్నాక్స్ గా తీసుకుంటే బాగుంటుందని నిపుణులు చెబుతున్నారు. యాపిల్స్ తోనూ ఐరన్ బాగానే అందుతుంది. ప్రతి వందగ్రాములకు 0.5 మిల్లీగ్రాముల ఐరన్ ఉంటుంది. పుచ్చకాయ (వాటర్ మెలన్)లో ఐరన్ ఎక్కువే. ప్రతి 100 గ్రాముల వాటర్ మెలన్ లో 0.4 మిల్లీగ్రాముల ఐరన్ ఉంటుంది. పైగా శరీరానికి అదనపు పోషకాలు కూడా అందుతాయి. ప్రతి వంద గ్రాముల దానిమ్మ గింజల్లో 0.3 మిల్లీగ్రాముల ఐరన్ ఉంటుంది. అంతేకాదు విటమిన్ సీ, యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువ. ఇవి శరీరం ఐరన్ ను బాగా సంగ్రహించేందుకు తోడ్పడుతాయి. కివీ పళ్లలోనూ ప్రతి వంద గ్రాములకు 0.3 మిల్లీగ్రాముల ఐరన్ ఉంటుంది. దీనిలో విటమిన్ సీ చాలా ఎక్కువ. అంజీర్ (ఫిగ్స్)లో ప్రతి వంద గ్రాములకు 0.2 మిల్లీగ్రాముల ఐరన్ ఉంటుంది. దీనిలోని ఫైబర్, ఇతర పోషకాలు శరీరానికి మేలు చేస్తాయి. ఇదే ఎండబెట్టిన అంజీర్ లో ఐరన్ మరింత ఎక్కువగా లభిస్తుంది. ఎండబెట్టిన (డ్రై) ఆప్రికాట్స్ లో ప్రతి వంద గ్రాములకు 2.7 గ్రాముల ఐరన్ లభిస్తుంది. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు ఐరన్ శరీరానికి బాగా అందేలా తోడ్పడతాయి.





## మారిన జీవన శైలితో చాలా మందిలో ఊబకాయం సమస్య

## ముఖ్యంగా పొట్ట, నడుము చుట్టూ పేరుకుపోతున్న కొవ్వుతో ఇబ్బందులు

## కొన్ని రకాల పళ్లలోని పోషకాలు, రసాయన సమ్మేళనాలతో ఆ కొవ్వు కరుగుతుందంటున్న ఆరోగ్య నిపుణులు

## డైటింగ్, వ్యాయామంతోపాటు వీటిని అదనంగా చేర్చుకుంటేనే ప్రయోజనమని స్పష్టీకరణ

మారిన జీవన శైలితో చాలా మంది బరువు పెరిగిపోతున్నారు. ముఖ్యంగా పొట్టచుట్టూ, నడుము వద్ద కొవ్వు పేరుకుపోతోంది. ఊబకాయం ముసురుకుంటోంది. అలాంటివారు బరువు తగ్గేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. మొత్తంగా బరువు తగ్గినా... పొట్ట చుట్టూ ఉన్న కొవ్వు (బెల్లీ ఫ్యాట్) తగ్గడం మాత్రం కష్టమే. అయితే కొన్ని రకాల పళ్లను రోజూ మన ఆహారంలో చేర్చుకుంటే... బెల్లీ ఫ్యాట్ ను కరిగించడానికి తోడ్పడుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మొత్తంగా బరువు తగ్గడానికి కూడా వీలవుతుందని సూచిస్తున్నారు. అయితే డైటింగ్, వ్యాయామంతోపాటు అదనంగా ఈ పళ్లను తీసుకుంటేనే ప్రయోజనమని... వాటిని మానేస్తే లాభం ఉండదని స్పష్టం చేస్తున్నారు.

బెర్రీ జాతికి చెందిన పళ్లు... దానిమ్మ

స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప బెర్రీలు వంటి బెర్రీ జాతికి చెందిన పళ్లలో, దానిమ్మ పళ్లలో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ ఎక్కువ. ఇవి జీర్ణవ్యవస్థను సరిదిద్దుతాయి. కొవ్వు తగ్గే ప్రక్రియను వేగవంతం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు వాటి గ్లైసిమిక్ ఇండెక్స్ కూడా తక్కువని వివరిస్తున్నారు. ఇక దానిమ్మలోని పాలీఫెనాల్స్ శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రిస్తాయని చెబుతున్నారు.



### యాపిల్స్...

యాపిల్స్ లో ఫైబర్ ఎక్కువగా, కేలరీలు తక్కువగా ఉంటాయని.. దీనితో కడుపు నిండుగా ఉన్నట్టు అనిపిస్తుందని, శరీరానికి శక్తి తక్కువగా అందుతుందని నిపుణులు చెబుతున్నారు. యాపిల్స్ లో ఉండే పెక్టిన్ అనే ప్రత్యేకమైన ఫైబర్ ఆహారం జీర్ణమయ్యే వేగాన్ని తగ్గించి, ఆకలిని నివారిస్తుందని వివరిస్తున్నారు.

### అవకాడోలు...

వీటిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, ఇతర రసాయన సమ్మేళనాలు శరీరంలో ఇన్ ఫ్లమేషన్‌ను తగ్గించి, కొవ్వులను కరిగించే హార్మోన్ల ఉత్పత్తిని పెంచుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

### నారింజ పళ్లు...

వీటిలో కేలరీలు తక్కువ, విటమిన్ సీ చాలా ఎక్కువని... శరీరంలో జీవక్రియలను వేగవంతం చేసి కొవ్వు తగ్గేందుకు తోడ్పడుతాయని నిపుణులు చెబుతున్నారు. నారింజ పళ్లలో అధికంగా ఉండే ఫైబర్... కడుపు నిండుగా ఉన్న భావన కలిగించి, ఆకలిని తగ్గిస్తుందని వివరిస్తున్నారు. బొప్పాయిలోని పాపైన్ అనే ఎంజైమ్ మన జీర్ణ వ్యవస్థను సరిదిద్ది, పొట్టచుట్టూ ఉన్న కొవ్వును తగ్గించేందుకు దోహదపడుతుందని వివరిస్తున్నారు.

దబ్బపండు (గ్రేప్ ఫ్రూట్)లో ఉండే ఎంజైమ్ లు శరీరంలో షుగర్ స్థాయులు, ఇన్సులిన్ విడుదలను నియంత్రిస్తాయని.. కొవ్వు కరిగేందుకు తోడ్పడుతాయని నిపుణులు చెబుతున్నారు. పుచ్చకాయ (వాటర్ మెలన్)లో ఉండే అర్జినైన్ అనే అమైనో యాసిడ్ శరీరంలో కొవ్వును కరిగించే ప్రక్రియను వేగవంతం చేస్తుందని వివరిస్తున్నారు. పైనాపిల్ లో ఉండే బ్రమెలీన్ ఎంజైమ్ మన జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపర్చి, కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తుందని... కొవ్వు తగ్గేందుకు తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com